**విలేఖరులు కావలెను**

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com

ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

తెలుగు జాతీయ దిన పత్రిక

TELTEL/2012/47103

సంపుటి : 12 సంచిక :106 నల్గొండ | శనివారం 12-07-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ | పేజీలు : 4 వెల : రూ.1/-

## ఇంజనీరింగ్ కళాశాలలో ఫీజు పెంపునకు హైకోర్టు నో




హైదరాబాద్ : ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలకు తెలంగాణ హైకోర్టు లో బిగ్ షాక్ తగిలింది. ఫీజులు పెంచాలన్న ప్రైవేట్ కాలేజీల అభ్యర్థనను తిరస్కరిస్తూ మధ్యంతర ఉత్తర్వులను విడుదల చేసింది. ఆరు వారాలలోపు ఇంజినీరింగ్ ఫీజుల ను నిర్ణయించాలని ఫీజుల నియంత్రణ కమిటీకి ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చింది. రాష్ట్ర సర్కార్ తీసుకునే తుది నిర్ణయంపైనే ఫీజుల పెంపు ఆధారపడి ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలకు బిగ్ షాక్ తగిలినట్లు అయింది.ఇక, తెలంగాణ హైకోర్టు తీర్పుతో ప్రైవేట్ కళాశాలలు ఎదురు చూస్తున్న ఫీజుల పెంపు ఆశలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఇప్పటికే నిర్వహణ ఖర్చులు పెరిగాయని, నాణ్యమైన విద్యకు తగిన వనరులు కావాలంటూ ప్రైవేట్ కాలేజీలు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, హైకోర్టు మాత్రం చట్టపరమైన ప్రక్రియలో ముందుకెళ్లాలని క్లారిటీ ఇచ్చింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థులు ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరేందుకు ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. అయితే, ఫీజుల పెంపుపై స్పష్టత రానంత వరకూ అడ్మిషన్ ప్రక్రియలో అస్థిరత ఏర్పడే అవకాశం ఉంది.

ఫీజు పెంపుకు చైతన్య భారతికి హైకోర్టు అనుమతి. .

2025-26 నుంచి 2027-28 వరకు బ్లాక్ పీరియడ్‌కు బీఈ/బీటెక్, ఎంటెక్, ఎంబీఏ/ఎంసీఏ కోర్సుల ఫీజును పెంచుకునేందుకు చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) చేసిన అభ్యర్థనను తెలంగాణ హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఆ కళాశాల వసూలు చేసే ఫీజుల వివరాలు ఎప్పటికప్పుడు అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేయాలని తెలంగాణ ఎంసెట్ అడ్మిషన్ల కన్వీనర్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి విజయసేన్ రెడ్డి ఆదేశించారు. బీటెక్ కోర్సులకు ఏడాదికి రూ. 2,23,000గా, ఎంటెక్ కోర్సుకు రు. 1,51,600, ఎంబిఎ, ఎంసిఎ కోర్సుకు రు. 1,40,000లకు పెంచేందుకు కోర్టు చైతన్యకు అనుమతించింది. పెరిగిన ఫీజులు కోర్టు తుది తీర్పుకు లోబడి ఉండాలని కోర్టు స్పష్టం చేసింది..

## ముందు ఏ పార్టీలో ఉన్నావో చెప్పు శశిథరూర్!



కేరళ: కేరళ రాష్ట్రంలోని యూడీఎఫ్ నేతల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిగా తన వైపే మొగ్గు చూపుతున్నారనే సర్వే బయటకు వచ్చిందంటూ లోక్‌సభ ఎంపీ శశిథరూర్ చేసిన పోస్టుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.ఆయన వ్యాఖ్యలకు కాంగ్రెస్ పార్టీ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది.. మొదట ఆయన ఏ పార్టీలో కొనసాగుతున్నారో చెప్పాలని డిమాండ్ చేసింది. ఇక, సర్వేల్లో ఎవరో ఒకరు మొదటి వరుసలో ఉంటారు.. కానీ, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో కేరళలో యూడీఎఫ్ కూటమి అధికారంలోకి వస్తే, దానికి చెందిన వ్యక్తే చీఫ్ మినిస్టర్ అవుతారు.. మా అసలు టార్గెట్ ఎన్నికల్లో విజయం సాధించడమే.. శశిథరూర్ అనవసర వివాదాలు సృష్టించొద్దు అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కె.మురళీధరన్ స్పష్టం చేశారు.ఇక, ఎంపీ శశిథరూర్‌కు కాంగ్రెస్ పార్టీతో ఉన్న సంబంధాలు రోజురోజుకీ తగ్గిపోతున్నాయి. పార్టీ నేతలకు, ఆయనకు మధ్య వరుసగా విమర్శలు, ప్రతి విమర్శలు కొనసాగుతున్నాయి. ఇదే, సమయంలో ప్రధాని నరేంద్ర మోడీని ప్రశంసిస్తూ శశిథరూర్ ఓ వ్యాసం రాశారు. దీనిపై ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే స్పందిస్తూ.. కొందరికి మోడీనే ప్రాధాన్యమంటూ మండిపడ్డారు. దీనికి కౌంటర్‌గా థరూర్ ఓ పక్షి ఫొటోను షేర్ చేసి.. ఎగరడానికి ఎవరి పర్మిషన్ అవసరం లేదు.. రెక్కలు నీయి.. ఆకాశం ఎవరి సొంతం కాదు అనే సందేశాన్ని రాసుకొచ్చాడు. శశిథరూర్ మెసేజ్ పై కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ 'ఎక్స్' వేదికగా ఓ పోస్ట్ పెట్టారు.. ఎగరడానికి పర్మిషన్ అడగొద్దు.. కానీ, ఈ రోజుల్లో స్వేచ్ఛగా ఎగిరే పక్షి కూడా ఆకాశాన్ని నిశితంగా గమనించాలి.. ఆ పక్షులను ఎల్లప్పుడూ గద్దలు, రాబందులు వేటాడుతూనే ఉంటాయని సూచించారు.

## హెచ్‌సీఏ స్కామ్.. రంగంలోకి ఈడీ!




హైదరాబాద్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) స్కామ్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. హెచ్‌సీఏ స్కామ్‌పై పూర్తి వివరాలు కావాలని తెలంగాణ నేర పరిశోధన విభాగం (సీఐడీ)ను ఈడీ కోరింది. హెచ్‌సీఏలో పెద్ద మొత్తంలో ఆర్థిక లావాదేవీలు జరిగినట్లుగా అనుమానం వ్యక్తం చేసింది. హవాలా, మనీ లాండరింగ్ రూపంలో లావాదేవీలు జరిగినట్టుగా ఈడీ అనుమానిస్తోంది. హెచ్‌సీఏ కమిటీ సభ్యులు పెద్ద మొత్తంలో ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించింది. బీసీసీఐ, ఐపీఎల్ ఫ్రాంచైజీ నుంచి వస్తున్న డబ్బులను దుర్వినియోగం చేసినట్లుగా ఈడీ అనుమానాలు వ్యక్తం చేసింది.హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికలో అక్రమాలు చేశారని, పదవి చేపట్టాక భారీగా నిధులు మళ్లించారని ప్రెసిడెంట్ జగన్మోహన్ రావుపై ఆరోపణలు ఉన్నాయి. మాజీ మంత్రి కృష్ణ యాదవ్ సంతకాన్ని శ్రీచక్ర క్లబ్ ప్రెసిడెంట్ కవిత ఫోర్జరీ చేసి, ఆ పత్రాలను జగన్మోహన్‌కు అందించారని.. ఆ పత్రాలతో హెచ్‌సీఏ అధ్యక్షుడైనట్లు సీఐడీ ఆరోపిస్తోంది. ఐపీఎల్ 2025 టికెట్ల కేటాయింపులో భారీగా ఆర్థిక అక్రమాలు జరిగాయని గుర్తించింది. ఈ నేపథ్యంలో జగన్మోహన్‌ను సీఐడీ గురువారం అరెస్టు చేసింది. మల్కాజ్‌గిరి న్యాయస్థానం అతడికి 12 రోజుల రిమాండ్ విధించింది. జగన్మోహన్‌తో పాటు హెచ్‌సీఏ కోశాధికారి శ్రీనివాస్ రావు, సీఈవో సునీల్, ప్రధాన కార్యదర్శి రాజేందర్ యాదవ్, ఆయన సతీమణి కవితను సీఐడీ అధికారులు విచారిస్తున్నారు.

## మోదీ రిటైర్మెంట్ గురించే ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ వ్యాఖ్యలంటూ కాంగ్రెస్ పోస్టు



న్యూఢిల్లీ: రాజకీయ నేతలు ఎవరైనా సరే 75 ఏళ్లు రాగానే రిటైర్మెంట్ తీసుకోవాలంటూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమవుతున్నారు. దీనిపై కాంగ్రెస్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా రంగంలోకి దిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించే మోహన్ భాగవత్ ఈ వ్యాఖ్యలు చేశారని విమర్శలు గుప్పించింది.మోహన్ భాగవత్ గత బుధవారంనాడు నాగపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ.. '75 ఏళ్లు వచ్చాయంటే దాని అర్థం మీరు తప్పుకుని ఇతరులకు అవకాశం ఇవ్వాలనే' అని అన్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త మోరోపంత్ పింగ్లే సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసేవారని గుర్తుచేశారు. '75 ఏళ్ల శాలువా మన మీద కప్పారంటే నిర్దిష్ట వయసుకు మనం చేరుకున్నామని అర్థం. మనం హుందాగా పక్కకు తప్పుకుని వేరే వాళ్లకు పనిచేసే అవకాశం ఇవ్వాలి' అని పింగ్లే చెప్పేవారని అన్నారు.మోదీ, మోహన్ భాగవత్‌లు 1950 సెప్టెంబర్‌లో జన్మించారు. భాగవత్ 11న, మోదీ 17న పుట్టారు. రిటైర్మెంట్ వయసుపై భాగవత్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్ సోషల్ మీడియా 'ఎక్స్'లో స్పందించారు. 'పలు అవార్డులు తీసుకుని విదేశాల నుంచి తిరిగి వస్తున్న మోదీకి లభించిన స్వాగతం చూడండి. ఈ ఏడాది సెప్టెంబర్ 17 నాటికి 75 ఏళ్లు పూర్తవుతాయని మోదీకి ఆర్ఎస్ఎస్ చీఫ్ గుర్తు చేశారు. భాగవత్‌కు కూడా సెప్టెంబర్ 11వ తేదీకి 75 ఏళ్లు పూర్తవుతాయని మోదీ గుర్తుచేయాలి' అని ఆయన ట్వీట్ చేశారు. ఇటు మోదీ, అటు భాగవత్ ఇద్దరూ బ్యాగులు సద్దుకుని ఈఫీసు వదిలిపెట్టాలంటూ కాంగ్రెస్ మరో నేత పవన్ ఖేర అన్నారు. కాగా, శివసేన యూబీటీ నేత సంజయ్ రౌత్ మాట్లాడుతూ, 75 ఏళ్ల రాగానే గతంలో పలువురు సీనియర్ నేతలకు ఉద్వాసన చెప్పిన నిబంధననే మోదీ తనకు కూడా వర్తింపజేసుకోవాలని అన్నారు. ఎల్.కె.అడ్వాణి, మురళీ మనోహర్ జోషి, జస్వంత్ సింగ్ వంటి నాయకులను 75 ఏళ్లు వచ్చాయంటూ బలవంతంగా మోదీ రిటైర్ చేయించారని, అదే నిబంధన ఇప్పుడు ఆయన కూడా పాటిస్తారా అనేది చూడాలని అన్నారు.మోదీ గత మార్చిలో నాగపూర్‌లోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. దీంతో మోదీ రిటైర్మెంట్ అంశం చర్చించేందుకు వెళ్లారంటూ వార్తలు వచ్చాయి. అయితే మోదీ రిటైర్మెంట్ ఊహాగానాలను 2023లోనే కేంద్రం హోం మంత్రి అమిత్‌షా తోసిపుచ్చారు. 2029 వరకూ మోదీనే నాయకత్వం వహిస్తారని చెప్పారు. బీజేపీ రాజ్యాంగంలో అసలు రిటైర్మెంట్ అనేది లేదని చెప్పారు.

## రామచంద్రావుకి బిజెపి అధ్యక్ష పదవా..




హైదరాబాద్ : తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఢిల్లీలో ఆయన నేడు మీడియాతో మాట్లాడుతూ.. హెచ్‌సీయూ పీహెచ్‌డీ స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్య కు కారణమైన రామచందర్ రావును తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. ఆయనకు ఆ పదవి ఇవ్వడంపై బీజేపీ అధిష్టానం పునరాలోచన చేయాలన్నారు. రోహిత్ వేముల మరణానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోకుండా పదవులు ఇస్తున్న బీజేపీ.. దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు భట్టి.రోహిత్ వేముల ఆత్మహత్య ఘటనపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ జరుపుతోందన్నారు. త్వరలోనే తెలంగాణలో రోహిత్ వేముల చట్టాన్ని తీసుకువస్తామని.. న్యాయశాఖ దీనిపై పనిచేస్తోందని చెప్పారు. రోహిత్ ఆత్మహత్యకు కారణమైన బండారు దత్తాత్రేయకు గవర్నర్ పదవి, ఏబీవీపీ నాయకుడు సుశీల్ కుమార్‌కు ఢిల్లీ యూనివర్శిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్, రామచందర్ రావుకు తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి ఇచ్చారన్నారు. 2016లో యూనివర్శిటీ యాజమాన్యం రోహిత్ వేములపై చర్యలు తీసుకునేలా యూనివర్శిటీ వద్ద రామచందర్‌రావు ఆందోళన చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం దళితులు భయపడేలా బీజేపీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. దళితులు, ఆదివాసీలకు దేశంలో గౌరవం లేకుండా బీజేపీ ప్రవర్తిస్తోందని విమర్శించారు.దేశంలో దళితులు, ఆదివాసీలకు వ్యతిరేకంగా వ్యవహరించే వారికి బీజేపీ పదవులు ఇస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ వ్యవహరిస్తున్న తీరు ఆందోళనకరమన్నారు ఉపముఖ్యమంత్రి. రాజ్యాంగానికి వ్యతిరేకంగా బీజేపీ వ్యవహరిస్తోందని ఫైర్ అయ్యారు. దేశంలో వందల ఏళ్లుగా వెనుకబడిన వర్గాలు అణచివేతకు గురవుతున్నాయని తెలిపారు. దేశంలో ఉన్న ప్రతీ పౌరుడి హక్కులను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. అలాగే రోహిత్ వేముల చనిపోతే కనీసం ఆ కుటుంబాన్ని కేసీఆర్ పరామర్శించలేదని వ్యాఖ్యలు చేశారు. ఏ రోజు కూడా యూనివర్శిటీల సంక్షేమాన్ని పట్టించుకోలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దుయ్యబట్టారు.

## రేవంత్ రెడ్డిది అతి తెలివి..! హరీశ్‌రావు విమర్శ



హైదరాబాద్ : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అతి తెలివి ప్రదర్శిస్తూ.. ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నాడని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. సాగునీటి పంపిణీ విషయంలో రేవంత్ రెడ్డి పచ్చి అబద్దాలు మాట్లాడారని ధ్వజమెత్తారు. పీసీ ఘోష్ కమిషన్‌ను కలిసిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.ఉమ్మడి ఏపీలో 54 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చినా అని రేవంత్ రెడ్డి అన్నాడు. రేవంత్ రెడ్డి పుట్టక ముందు ముత్తాత పుట్టక ముందు ఉన్న ఆయకట్టును కూడా కాంగ్రెస్‌లో కలుపుకున్నడు. 400 ఏండ్ల కింద కాకతీయ రెడ్డి రాజులు కట్టించిన చెరువులు కూడా కాంగ్రెస్ చేసిందా..? నిజాంలు కట్టిన ప్రాజెక్టులు కూడా అందులో కలుపుకున్నడు. ఎన్నో ప్రాజెక్టులు గోదావరి, కృష్ణా 1956 ముందు తెలంగాణ ప్రాంతంలో ఉన్నాయి. 16 లక్షల ఎకరాలకు ఏపీ ఏర్పాటుకు ముందే నీటి పారుదల సౌకర్యం ఉంది. ఇది కూడా కలుపుకొని 54 లక్షల ఎకరాలకు ఇచ్చినా అని రేవంత్ రెడ్డి అంటున్నాడని హరీశ్‌రావు మండిపడ్డారు.1956లో రాష్ట్ర బడ్జెట్ 19 కోట్లు, ఆనాటి వంద రూపాయలు ఈనాటి 10,434 రూపాయలకు సమానం. ఆనాటి రూపాయి నేడు 104 రూపాయలకు సమాధానం. బీఆర్ఎస్ హయాంలో 17 లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టు, 31 లక్షల ఎకరాలకు స్థిరీకరణ చేసాం. మొత్తం 48లక్షల ఎకరాలకు సాధించినం. ప్రజల్ని తప్పుదోవ పట్టించే అతి తెలివి ఉపయోగించి, పదేండ్లు కాంగ్రెస్ పాలించింది, ఇచ్చిన ఆయకట్టు కేవలం కొత్త, స్థిరీకరణ కలిపి ఆరు లక్షల ఎకరాలు మాత్రమే. మేము ఇచ్చింది 48 లక్షలు, పదేండ్ల కాంగ్రెస్ ఇచ్చింది ఆరు లక్షల ఎకరాలు మాత్రమే అని హరీశ్‌రావు తెలిపారు.

పీసీ ఘోష్ కమిషన్‌ను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం..! :

హైదరాబాద్ : కాళేశ్వరం మీద ఏర్పాటైన పీసీ ఘోష్ కమిషన్‌ను తప్పుదోవ పట్టించేలా వివరాలను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందనే అనుమానం మాకు ఉంది అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. పీసీ ఘోష్ కమిషన్‌కు అదనపు సమాచారం అందించిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.కమిషన్‌ను కలిసి అదనపు సమాచారం అందించాం. కమిషన్ నిన్న సమయం ఇచ్చారు. నిన్న కేసీఆర్‌కు వైద్య పరీక్షలు ఉన్న నేపథ్యంలో రాలేకపోతున్నాను అని కమిషన్‌ను రిక్వెస్ట్ చేయగా అంగీకరించారు. వారిచ్చిన సమయం ప్రకారం, ఈరోజు కమిషన్‌ను కలిసి మా వద్ద ఉన్న అదనపు సమాచారం అందించాం. మీడియాలో వస్తున్న తప్పుడు వార్తలను దృష్టిలో పెట్టుకొని మా వద్ద ఉన్నంత మేరకు కమిషన్‌కు స్పష్టమైన సమాచారం ఇచ్చామని హరీశ్‌రావు తెలిపారు.మేం ఇప్పుడు ప్రభుత్వంలో లేము. డాక్యుమెంట్స్ అన్ని ప్రభుత్వం వద్ద ఉంటాయి. సమాచారం కోసం చీఫ్ సెక్రెటరీ, జీఏడీ సెక్రెటరీ, ఇరిగేషన్ సెక్రెటరీ గారికి లేఖ రాశాను. ఆ రోజుల్లో తీసుకున్న క్యాబినెట్ నిర్ణయాలు, క్యాబినెట్ నోట్ వంటి సమాచారం కావాలని లేఖల రూపంలో అడిగాను. కాని వారి నుంచి స్పందన రావడం లేదు. మా వద్ద అందుబాటులో ఉన్న సమాచారం క్రోడీకరించి నోట్ రూపంలో ఇవ్వడం జరిగింది. మా సమాచారం అధారంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి ఆరు సార్లు క్యాబినెట్ నిర్ణయాలు జరిగాయి. ఆరు సార్లు క్యాబినెట్ ఆమోదం పొందిన డాక్యుమెంట్లు కమిషన్‌కు అందించాం. అంతే కాదు మూడు సార్లు శాసన సభ ఆమోదం కూడా పొందింది. ఎప్పుడెప్పుడు జరిగాయి, జరిగిన చర్చ, ఇతర అంశాలను కమిషన్‌కు అందించాం. లెజిస్టేచర్ అప్రూవల్ క్యాబినెట్ కంటే కూడా ఉత్తమం అయినటువంటిది. ఆరు సార్లు క్యాబినెట్ అప్రూవల్ వివరాలను, మూడు సార్లు అసెంబ్లీ ఆమోదం, చర్చ వివరాలను కమిషన్‌కు డాక్యుమెంట్లతో సహా అందించామని హరీశ్‌రావు తెలిపారు.కమిషన్ ఆన్ గోయింగ్ కనుక ఆ వివరాలు బయట పెట్టలేను. సందర్భం వచ్చినప్పుడు పూర్తిగా ఆ వివరాలు బయట పెడతాం.ఇంతకు మించిన వివరాలు ఉన్నాయి, కానీ ప్రభుత్వం మాకు అడిగినా ఇవ్వడం లేదు. కమిషన్‌కు అందించిన సమాచారం మాకు ఇవ్వాలని అడిగితే ప్రభుత్వం ఇవ్వడం లేదు. పారదర్శకంగా ఉండాలనుకుంటే మాకు ఆ వివరాలు ఎందుకు ఇవ్వడం లేదు. కమిషన్‌ను తప్పుదోవ పట్టించేలా వివరాలను ఈ ప్రభుత్వం అందిస్తుందనే అనుమానం మాకు ఉంది అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## మానవ వనరులను వినియోగించుకోవాలి




అమరావతి, జనాభా నియంత్రణ కాదు.. నిర్వహణ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వెలగపూడిలోని సచివాలయం వద్ద ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. జనాభా అనేది భారం కాకుండా ఆస్తిగా భావించే కాలం వచ్చిందని వ్యాఖ్యానించారు. జనాభా భారం కాదు.. జనమే ఆస్తి.. అదే అతి పెద్ద పెట్టుబడిగా చంద్రబాబు నాయుడు అభివర్ణించారు .. మొదటి సారి ఆంధ్రప్రదేశ్ లో జనాభా దినోత్సవం ఫోకస్ తో జరుగుతోంది.. దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్.. అని గురజాడ అప్పారావు చెప్పారు. దేశమంటే మనుషులు.. కష్టాలు.. సమస్యలు.. పరిష్కారం అన్నీ ఉంటాయి.. గురజాడ స్ఫూర్తితో ముందుకు వెళ్లాలి.. ఇద్దరు పిల్లలు ఉంటే స్థానిక ఎన్నికల్లో పోటీకి అనర్హులు అని నేనే చట్టం తీసుకొచ్చా.. కానీ, ఒక్కోసారి పాలసీలు మార్చుకోవాల్సిన పరిస్థితి వస్తుంది.. ఇప్పుడు జనాభా భారం కాదు.. జనమే ఆస్తి అని చంద్రబాబు అన్నారు. భారతదేశంలో ఎక్కువ జనాభా ఉండటం మనకు పెద్ద వనరని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా యువశక్తి క్షీణించి అభివృద్ధి కూడా తగ్గిపోతోందన్నారు. ఆర్థిక సంస్కరణలు అందిపుచ్చుకున్న తెలుగువారు అగ్రస్థానంలో ఉన్నారని తెలిపారు. దేశమంటే మనుషులు అనే నినాదానికి సార్థకత చేకూరాలని సీఎం అన్నారు. గురజాడ చెప్పిన స్ఫూర్తితో ముందుకెళ్లాలని సూచించారు. ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ మంది ఉంటే స్థానిక సంస్థల్లో పోటీ- చేయడానికి అర్హత లేదని గతంలో నేనే చట్టం తీసుకొచ్చా. జనాభా నియంత్రణ కాదు.. జనాభా నిర్వహణ చేయాలి. దీనిపై సూచనలు ఇవ్వాలని కోరుతున్నామంటే అదీ మార్పు. పరిస్థితులకు అనుగుణంగా పాలసీలు మార్చుకోకపోతే చాలా సమస్యలు వస్తాయి. మంచి పాలసీ ఏవిధంగా తేవాలని ఇక్కడ మనం కూర్చొని ఆలోచిస్తున్నాం. ప్రపంచ జనాభా 500 కోట్లకు చేరిన సందర్భంగా 1985 జులై 11న మొదటిసారి ఐరాస ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించింది. గతంలో జనాభా ఎక్కువ ఉన్న దేశాలను చులకనగా చూసేవాళ్లు. ఇప్పుడు జనాభా ఎక్కువ ఉన్న దేశాలపై ఆధారపడే పరిస్థితి వచ్చింది. జనమే ప్రధాన ఆస్తిగా భావించే రోజులు వచ్చాయి. ప్రత్యుత్పత్తి రేటు- 2.1గా ఉంటే జనాభా పెరుగుదల స్థిరంగా ఉంటు-ంది. మన రాష్ట్రంలో ప్రత్యుత్పత్తి రేటు- 1.8గా ఉంది.. ఇది మెరుగుపడాలని సీఎం అన్నారు. జనాభా తక్కువుంటే అవసరాల నిమిత్తం ఇతర రాష్ట్రాలకి తరలి వెళ్తారు.. జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ స్థానాలు ఉంటాయి.. జనాభా పెరిగితే పార్లమెంట్ స్థానాలు పెరుగుతాయి, అవకాశాలు ఉంటాయి అన్నారు సీఎం చంద్రబాబు.. ఇక, నేనెప్పుడూ మహిళా పక్షపాతిని..


## సంపాదకీయం

శనివారం 12-07-2025

# జనాభా నియంత్రణ తక్షణావశ్యకత !

ప్రతి ఏటా జూలై 11వ తేదీన 'ప్రపంచ జనాభా దినోత్సవాన్ని' నిర్వహి స్తున్నారు. ప్రపంచ జనాభా ఇప్పటికే 800 కోట్లు దాటింది. భారతదేశ జనాభా అధికారికంగా 140కోట్లకు చేరుకుంది. ఇందులో పెరుగుదలే తప్ప తక్కు ఉండదని చెప్పొచ్చు. జనాభా పెరుగుదలతో పాటు కనీస వసతులు, వనరులు లేకపోవడంతో భారతదేశం ఇంకా పేదరికంలోనే మగ్గుతోంది. ఇకపోతే ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుదలకు, తరుగు దలకు సంబంధించిన విషయాల గురించి ప్రజలలో చైతన్యం తెచ్చేందుకుగాను ఐక్యరాజ్యసమితి 1989వ సంవత్సరంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ప్రారంభించింది. జనాభా నియంత్రణ అన్నది ఎవరికి వారు నిర్దేశించుకోవాల్సిన అవసరం ఉంది. ఆయా దేశాలు తమ దేశాల వనరుల ఆధారంగా నియంత్రణ చర్యలు పాటించాలి.నియంత్రణ లేకపోవడంతో ప్రపంచ జనాభా విపరీతంగా పెరిగి పోతున్నది. పెరిగిన జనాభా వలన పలు ప్రపంచ దేశాలు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ప్రజలకు కనీస మౌలిక సదుపా యాలు కల్పించ లేక సతమతమ వుతున్నాయి. విద్య,వైద్యం,ఆరోగ్యం, త్రాగునీరు, పారిశుధ్యం వంటి అనేక అంశాల్లో ప్రభుత్వాలు ప్రజలకు న్యాయం చేయలేక పోతున్నాయి. పెరుగుతున్న జనాభా కారణంగా కనీస వసతుల కల్పన ఏ ప్రభుత్వాని కైనా తలకుమించిన భారంగా మారుతోంది. గృహకల్పన, అక్షరాస్యత, నిరుద్యోగం, పౌష్ఠికాహారం, ఉద్యోగ కల్పన వంటి అంశాలు విషమ సమస్యలుగా మారాయి. ప్రకృతి వైపరీత్యాలతో అనేక దేశాలు సతమతమవు తున్నాయి. చాలా దేశాల్లో ఈనాటికీ కనీస విద్య గగకుసుమంలా మారింది. ఆహార సమస్యతో అనేక దేశాలు అలమటిస్తున్నాయి. మనదేశంలో త్వరలోనే జగనగణన జరుగనుంది. ఈ క్రమంలో ఈ వానాకాల పార్లమెంట్ సమావేశంలో మన ప్రతినిధులు దీనిపై చర్చించాలి. ఇప్పటికే 140 కోట్లకు జనాభా చేరుకున్న క్రమంలో జనాభా నియంత్రణపై దృష్టి సారించాలి. లేకుంటే భారతదేశ వనరులు బతకడానికి సరిపోవు. జనభా నియంత్రణపై ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. చైనాలాగా జనాభా నియంత్రించకపోతే రానున్నరోజుల్లో బతకడం దుర్లభంగా మారనుంది. చాలా దేశాలు దీన్ని పట్టించుకోక పోవడం వల్ల అనేకానేక సమస్యలు ఎదుర్కొంటున్నాయి. జన విస్ఫోటనంతో ఎన్ని రకాల విపరీత పరిణామాలు జరగాలో అన్నీ జరుగుతన్నాయి. పర్యావరణ విపరీత పరిస్థితుల కారణంగా అధిక వర్షాలు లేదా, అస్సలు వర్షాలు పడక పోవడం, వనరులన్నీ తగ్గిపోవడం వంటి విపరీత పరిణామాలు చూస్తున్నాం. ఆహారధాన్యాల కొరత ఏర్పడనుంది. ప్రకృతి విధ్వంసం జరిగింది. ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. ఇలా ఎన్నో విపరీత పరిణామాలు చూస్తున్నాం. అవన్నీ అనుభవంలోకి స్తున్నాయి. ఎన్ని దుష్ప్రభావాలు కలగాలో కలుగుతున్నాయి. ఉన్న వనరుల విధ్వంసం జరిగింది. జనాలకు సరిపడా ఆహారధాన్యాలు అందడం లేదు. పంటలు తక్కువ....తినేవారు ఎక్కువయ్యారు. నిరుద్యోగం తాండవిస్తోంది. నానాటికి ప్రపంచంలో జనాభా పెరుగుతోంది. నానాటికి పెరుగుతున్న జనాభా..తద్వారా తలెత్తే దుష్పరి ణామాలను ప్రజలకు వివరించేందుకు, వారికి ఆయా సమస్యలపై అవగాహన కలిగించేందుకు పూనుకోవాలి. పల్లెలు, పట్టణాలు, నగరాలు జనంతో కిటకిటలాడుతున్నాయి. హోటళ్ళు, సినిమా హాళ్ళు, షాపింగ్ మాల్స్, కూరగాయల మార్కెట్లు, హాస్పటల్స్.. ఇలా ఒకటేమిటి బ్యాంకుల నుండి బట్టల దుకాణాల వరకు ఎక్కడ చూసినా జనం. ఇసుక వేస్తే రాలనంత మంది జనంతో ప్రతీ ప్రాంతం కిటకిట లాడుతున్నది. దీంతో నివాస స్థలాలు కూడా భారంగా మారయి. ఇల్లు అందరికీ హక్కు అన్నది పోయి అదో కలగా మిగిలింది. అగ్ర రాజ్యాలు సైతం ఆర్థికంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయి... అన్నింటికి మించి ఆరోగ్య రంగంలో ముఖ్యంగా ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ విషయంలో ప్రపంచంలోని అనేక దేశాలు వెనుకబడి ఉన్నాము. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన సహస్రాబ్ది లక్ష్యాలను కూడా చేరుకోలేదు. అందరికీ ఆరోగ్యం అన్న లక్ష్యానికి ఇంకా దూరంగా వుండడానికి అధిక జనాభాయే కారణం. అయితే కొన్ని అంశాలలో అంతర్జాతీయ స్థాయి వైద్యం అందిస్తున్నామని చెప్పుకుంటున్నా...నేటికీ సామాన్యులకు అది కలగానే మిగిలింది. ఫార్మా, వ్యాక్సిన్ల రంగాల్లో ముందంజ వేస్తున్నా..జనాభాకు సరిపడా అందించలేని దుస్థితిలో ప్రపంచం ఉంది. మొత్తం మీద అధికా జనాభా ప్రధానంగా ఆరోగ్యరంగం అసమానతలకు కారణంగా మారింది. ఆధునిక జీవన శైలి, వివిధ రకాల ఆహారపు అలవాట్లతో మూడు ప్రధాన సమస్యలు మానవాళిని వెంటాడుతున్నాయి. ప్రస్తుతం రక్తపోటు, షుగర్ అనేవి చాలా సాధారణంగా మారిపోయాయి. కేవలం నగరాలు, పట్టణాలు కాకుండా పల్లెల్లోనూ ఈ సమస్యలు వెంటాడుతున్నాయి. కేవలం పని ఒత్తిడి కారణంగా ఈ జబ్బులు వస్తున్నాయన్నది సుస్పష్టం. సరైన ఆహారం తీసుకోకపోవడం, చిన్నారులు ఎక్కువగా ఎలక్ట్రానిక్ పరికరాలకు అలవా టు పడడం కారణాలుగా ఉన్నాయి. భారతదేశంలో ఊబకాయం కేసులు వేగంగా పెరుగుతున్నాయి. దీని కారణంగా ప్రజలు తీవ్రమైన వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఊబకాయం అనేది చిన్న సమస్య కాదని, ఇది ఒక వ్యాధిగా వృద్ధి చెందుతుందని చెప్పింది. స్థూలకాయం అంటే శరీరంలో కొవ్వు ఎక్కువగా ఉండట మని నిర్వచి ంచారు. ఆకలిని అధిగమించేందుకు అడ్డమైన గడ్డీ తినడం వల్ల కూడా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ఇలాంటి వారికి సకాలంలో వైద్యం అందించాలన్నా ఖరీదుగా మారింది. ప్రపంచంలో జనాభా పెరుగుదలను కట్టడి చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వాలు లేకపోవడం ఈ దారుణానికి కారణంగా చూడాలి. ముఖ్యంగా భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ లాంటి దేశాలు జనాభా నియంత్రణపై దృష్టి పెట్టడం లేదు. దీంతో పెరుగుతున్న జనాభాతో వనరులపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇది సకాలంలో చర్చించాల్సిన అతిపెద్ద సమస్యగా చూడాలి. జనాభా పెరుగుతున్న కొద్దీ సమస్యలు కూడా వాటంతట అవే పెరుగుతాయని గుర్తించాలి. ప్రతి కుటుంబం తమకు తాముగా జనాభా నియంత్రణకు కట్టుబడాలి. ప్రభుత్వాలు జనాభా నియంత్రణకు కఠిన చట్టాలు అమలు చేయాలి. లేకుంటే మరో పదేళ్లలో ఈ సమస్యను పరిష్కరిచలేని దశకు చేరుకోగలం.

# చైనాలో అధికార మార్పిడి తప్పదా



బీజింగ్,చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు అధ్యక్ష బాధ్యతల నుంచి తొలగిపోతున్నారన్న వార్త ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఆయన అధికారం నుంచి తప్పుకోబోతున్నారనే ఊహాగానాలు జోరందుకున్నాయి. కొంతకాలంగా జిన్‌పింగ్ బహిరంగ కార్యక్రమాలకు దూరంగా ఉండటం, బ్రిక్స్ సమావేశానికి హాజరు కాకపోవడం ఈ అనుమానాలకు బలం చేకూర్చాయి. ఈ క్రమంలో చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ అధికారాన్ని వీడబోతున్నారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. నియంతృత్వ పోకడలతో చైనా మొత్తాన్ని తన గుప్పిట్లో పెట్టుకున్న జిన్‌పింగ్ ఇప్పుడు ఎందుకు అనూహ్యంగా తప్పుకుంటున్నారన్నది అంతు చిక్కట్లేదు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అధికారాన్ని వీడబోతున్నారనే ఊహాగానాలు, అంతర్జాతీయ మీడియా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. దశాబ్దానికి పైగా చైనా రాజకీయాలను శాసిస్తున్న జిన్‌పింగ్, తన పాలనా పగ్గాలను నెమ్మదిగా కమ్యూనిస్టు పార్టీలోని కీలక విభాగాలకు బదిలీ చేస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవలి కాలంలో జిన్‌పింగ్ పలు కీలక అంతర్జాతీయ సమావేశాలకు, దేశీయ అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉండటం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది. బ్రెజిల్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సుకు ఆయన గైర్హాజరయ్యారు. గత 12 ఏళ్లలో ఆయన బ్రిక్స్ సమావేశానికి హాజరుకాకపోవడం ఇదే మొదటిసారి. చైనాలో జిన్‌పింగ్ తనదైన ముద్ర వేశారు. ఓ నియంతగా పేరు తెచ్చుకున్నారు. అదే సమయంలో చైనాను అగ్రస్థానంలో నిలిపేందుకు అనేక సంస్కరణలు చేపట్టారు. షీ జిన్‌పింగ్ 2012లో చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుండి ఆయన తన అధికారాన్ని పటిష్టం చేసుకోవడానికి వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. తన పాలన ప్రారంభంలోనే అగ్రశ్రేణి నాయకుల నుంచి చిన్న ఉద్యోగుల వరకు అందరినీ లక్ష్యంగా చేసుకున్నారు. భారీ ఎత్తున అవినీతి వ్యతిరేక ప్రచారాన్ని ప్రారంభించారు. ఇది పార్టీలో తన ప్రత్యర్థులను తొలగించి, తన పట్టు నిలుపు కునేందుకు సహాయపడింది. జిన్‌పింగ్ తనకు అనుకూలంగా 2018లో రాజ్యాంగాన్ని సైతం సవరించారు. అధ్యక్ష పదవికి ఉన్న రెండు-పదవీకాలాల పరిమితిని తొలగించారు. ఇది ఆయనకు జీవితకాల అధ్యక్షుడిగా ఉండే అవకాశాన్ని కల్పించింది. ఈ చర్య ద్వారా ఆయన అధికారాన్ని తన గుప్పిట్లో శాశ్వతంగా ఉంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అర్థమైంది. అందుకే ఆయన ఓ నియంతలా పేరు తెచ్చుకున్నారు. చైనా చరిత్రలో మావో జెడాంగ్ తర్వాత అత్యంత శక్తివంతమైన నాయకుడిగా మారారు. శాశ్వత అధ్యక్షుడిగా ఉండేందుకు జిన్‌పింగ్ రాజ్యాంగ నిబంధనలను మార్చుకున్నప్పటికీ, ఇప్పుడు ఆయన అధికారాన్ని వదులుకునేందుకు సిద్ధమయ్యారనే వార్తలు ఆసక్తి రేపుతున్నాయి. అయితే దీని వెనుక అనేక కారణాలు ఉన్నాయి. ఆయన తీసుకున్న పలు నిర్ణయాలు చైనా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ప్రస్తుతం చైనా ఆర్థిక వ్యవస్థ అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. నిర్మాణ రంగం సంక్షోభంలో ఉంది. యువతకు ఉద్యోగాలు లేవు. ప్రభుత్వ అప్పులు పెరిగిపోతున్నాయి. అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతలు ఆర్థిక వృద్ధిపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ఆర్థిక సవాళ్లకు సమర్థవంతమైన పరిష్కారాలు కనుగొనడంలో జిన్‌పింగ్ విఫలమయ్యారనే విమర్శలు పార్టీలోనే పెరుగుతున్నాయి. జిన్‌పింగ్ అధికారాన్నంతటినీ కేంద్రీకృతం చేశారు. తన గుప్పిట్లో ఉంచుకున్నారు. ఇది పార్టీలో అసమ్మతి రాజేసింది. మాజీ నాయకులు, సీనియర్ పార్టీ సభ్యులు జిన్‌పింగ్ నిర్ణయాలపై అసంతృప్తితో రగిలిపోతున్నారు. పార్టీలోని వివిధ వర్గాల నుంచి తీవ్ర ఒత్తిడి రావడం వల్లే, జిన్‌పింగ్ తలొగ్గి ఉండొచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. చైనాలో అధికార మార్పిడి ప్రపంచంలోని ఇతర ప్రజాస్వామ్య దేశాల్లో జరిగే సాధారణ ఎన్నికల పక్రియకు పూర్తి విరుద్ధంగా ఉంటుంది. అన్ని ప్రభుత్వ సంస్థలు, సైన్యం, న్యాయవ్యవస్థ, మీడియా... ఇలా అన్నీ పార్టీ నియంత్రణలోనే పనిచేస్తాయి. పార్టీ నాయకుల ఎంపిక, పదవీ విరమణ వంటి నిర్ణయాలు పార్టీలోని అత్యున్నత స్థాయి కమిటీలైన పొలిట్‌బ్యూరో, దాని స్టాండింగ్ కమిటీలే తీసుకుంటాయి. ఒకవేళ జిన్‌పింగ్ వైదొలిగితే ఆయన స్థానంలో ఎవరు బాధ్యతలు తీసుకుంటారనేదానిపై స్పష్టత లేదు. జిన్‌పింగ్ వారసుడిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నవాళ్లలో ప్రస్తుతం చైనా ప్రధానిగా లీ కియాంగ్ ముందున్నారు. జిన్‌పింగ్‌కు అత్యంత సన్నిహితుడు, నమ్మకస్తుడు. లీ కియాంగ్ తో పాటు- డింగ్ జుయెజియాంగ్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. చైనాలో అధికార మార్పిడి పక్రియ చాలా రహస్యంగా సాగుతుంది. ఒకవేళ జిన్‌పింగ్ అధికారం నుంచి తప్పుకుంటే, అది చైనా రాజకీయాల్లో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుంది.

# కల్తీ కల్లు కాటు.. శ్రమజీవులే బలి!




హైదరాబాద్,తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలనే ఆశతో రసాయనాలతో కల్తీ కల్లు తయారు చేసేవారు కోట్లు ఆర్జిస్తుండగా.. తాగిన వాళ్లకు చావే గతి అవుతున్నది. కల్తీ కల్లు మాఫియా రాజకీయ పార్టీల్లో ప్రాబల్యం పెంచుకుంటూ, అధికారులను మచ్చిక చేసుకుని తమ దందా నిరాటకంగా కొనసాగిస్తున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో కల్తీ కల్లు సమస్య మరోసారి చర్చల్లోకి వచ్చింది. కల్తీ కల్లు.. తాగిన వారి ప్రాణాలు హరిస్తున్నది. మహబూబ్ నగర్, నల్లగొండ, కామారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో వరుసగా చోటు చేసుకున్న కల్తీ కల్లు మరణాలు.. దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. కల్తీ కల్లు కారణంగా ఎందరో మానసిక రోగులుగా మారుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వాలు కల్తీ కల్లు మాఫియాను నియంత్రించడంలో విఫలమవుతున్నది. ఈ కల్తీ కల్లు కాటుకు కష్టజీవులే ప్రధానంగా బలవుతున్నారు. తాజాగా హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లిలో కల్తీ కల్లు తాగి నలుగురు చనిపోవడం, మరో 22 మంది హాస్పటళ్ల పాలవడంతో కల్తీ కల్లు వ్యవహారం మళ్లీ చర్చలోకి వచ్చింది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో కల్తీ కల్లును నివారించే క్రమంలో కల్లు కాంపౌండ్లను నిషేధించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కల్లుగీత కార్మికుల మేలు కోసం కేసీఆర్ ప్రభుత్వం పునరుద్ధరించింది. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా వాటిని కొనసాగిస్తున్నది. అయితే.. కల్లుడిపోలు, కాంపౌండ్లకు సరఫరా అవుతున్న కల్లులో నాణ్యత ప్రమాణాలపై సరైన నిఘా.. తనిఖీలు కొరవడటంతో కల్తీకల్లు మాఫియా రెచ్చిపోతున్నదనే అభిప్రాయాలు ఉన్నాయి. కల్తీ కల్లును అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖ మాముళ్ల మత్తులో జోగుతుండటంతో పట్టణాలు, గ్రామాల్లో కల్తీ కల్లు విచ్చలవిడిగా ప్రవహిస్తూ శ్రమజీవుల ప్రాణాలను హరించి వేస్తున్నదని సామాజిక కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నీడలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారని, కల్లుకు అలవాటు పడిన ప్రజల ప్రాణాలతో ఆటలాడుకుంటున్నారని పేర్కొంటున్నారు. ఆరోగ్యకరమైనదిగా చెప్పే కల్లు పేరిట కాసులకు కక్కుర్తిపడి కాలకూట విషాన్ని పేదల శరీరాల్లోకి నింపుతున్నారు. గ్రామాల్లోనే కాదు.. నగర ప్రాంతాల్లో సైతం కల్తీ కల్లు మాఫియా రెచ్చిపోతున్నా ఎక్సైజ్‌శాఖ పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. కల్తీ కల్లు కేసుల్లో ఎక్సైజ్, పోలీసు శాఖల మధ్య సమన్వయం కూడా సమస్యగా తయారైందని అంటున్నారు. క్లోరోహైడ్రేట్‌గా తేలితేనే తమ పాత్ర ఉంటుందని ఆబ్కారీ శాఖ చెబుతున్నది. మిగిలిన మత్తు పదార్థాలతో తమకు సంబంధం లేదని, అదంతా పోలీసులే చూసుకుంటారని వదిలేస్తున్నారని సామాజిక కార్యకర్తలు చెబుతున్నారు.

### కల్తీ కాటుకు వరుస మరణాలు

ఈ ఏడాది ఏప్రిల్లో కామారెడ్డి జిల్లాలో కల్తీ కల్లు తాగి ఏకంగా 58 మంది అస్వస్థతకు గురయ్యారు. నస్రుల్లా బాద్ మండలం అంకోల్, అంకోల్ తండా, దుర్కి, బీర్కూర్ దామరంచ గ్రామాల్లో కల్తీ కల్లు తాగిన బాధితులు అనారోగ్యానికి గురయ్యారు. కల్తీ కల్లు ప్రభావంతో మతిస్థిమితం కోల్పోయి వింతగా ప్రవర్తిస్తుండటంతో వారిని వెంటనే హాస్పిటల్కు తరలించారు. గాంధారి మండలంలోని గౌరారం గ్రామంలో కుస్తీ పోటీల ఉత్సవాల్లో కల్లు తాగిన 30 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఆరుగురు తీవ్ర అనారోగ్యానికి లోనయ్యారు. ఈ ఘటనలపై అప్పటి సబ్ కలెక్టర్ కిరణ్మయి విచారణ జరిపి కల్లు దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత షరా మామూలే అన్నట్టు పరిస్థితి కొనసాగుతున్నదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2024 ఆక్టోబర్‌లో మహబూబ్ నగర్ జిల్లాలోని బల్మూర్ మండల పరిధిలోని కొండనాగులపల్లి గ్రామంలో కల్తీ కల్లు తాగి ఓ యువకుడు మృతి చెందాడు. అంతకుముందు భూత్పూర్ మండలం అమిస్తాపూర్ గ్రామం అంబేద్కర్‌నగర్‌కు చెందిన పోస్టల్‌శాఖలో ఏబీపీఎం ఉద్యోగి విష్ణుప్రకాష్.. కల్తీ కల్లు తాగి పిచ్చి లేసి ఐసీయూలో చికిత్స పొందుతూ చనిపోయాడు. 2024 డిసెంబర్లో నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం పెర్కకొండారంలో కల్తీ కల్లు తాగిన ఆరుగురు అస్వస్థతకు గురయ్యారు.

### కాదేది కల్తీకి అనర్హం

స్వచ్ఛమైన ప్రకృతి ఒడిలో తాటి.. ఈత చెట్ల నుంచి వచ్చే కల్లు తాగుతున్నామన్న భావన క్రమంగా పట్టణాలే కాదు.. పల్లెల్లోనూ మాయమవుతున్నది. చెట్టు కాడికి వెళ్లి కల్లు తాగినా కూడా అక్కడ పోసే కల్లు స్వచ్ఛమైనదో కాదోననే సందేహం పట్టి పీడిస్తూ ఉంటుందని గ్రామీణులు వాపోతున్నారు. అలాంటిది.. పట్టణాల్లో కల్లు కంపౌండ్లలో దొరికే కల్లు నాణ్యతపై నమ్మకం నేతి బీరకాయలో నెయ్యి సామెత వంటిదేనని అంటున్నారు. గ్రామాల నుంచి కల్లు సేకరించి సీసాల్లో నింపి అబ్కారీ అనుమతులతో కల్లు కాంపౌండ్లు నిర్వహిస్తుంటారు. ఇక్కడ లభించే కల్లు స్వచ్ఛమైనదేననే భావనతోనే శ్రమజీవులు తమ ఒంటి కష్టం మర్చిపోయేందుకు కల్లును ఆశ్రయిస్తూ ఉంటారు. అటువంటి కష్టజీవులనే లక్ష్యంగా చేసుకుని కల్తీ మాఫియా మత్తు పదార్థాలు కలిపిన కల్లు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కసారి రసాయనాలు కలిపిన ఈ కల్లు తాగితే దానికే బానిసై పొద్దంతా తాగుతుంటారని వైద్య నిపుణులు చెబుతున్నారు. మత్తుపదార్థాలు కలిపిన కల్లు లభించనివారిలో వింత ప్రవర్తనలు చోటుచేసుకుంటున్నాయి. కల్తీ కల్లు తాగడం వల్ల నాలిక మొద్దు బారడం, కాళ్లు, చేతులు వంకర్లు పోవడంతోపాటు వింతగా ప్రవర్తిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఎక్సైజ్ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు కల్లు దుకాణాలు తనిఖీ చేయాలి. నమూనాలను ప్రాథమికంగా పరీక్షించడానికి అధికారుల వద్ద మినీ కిట్లు ఉంటాయి. కానీ, ఎక్కడా నమూనాల ఫలితాలను బయటకు వెల్లడించడం లేదన్న విమర్శలున్నాయి. కల్తీ కల్లు అస్వస్థత ఘటనలు బయటపడినప్పుడే హడావుడి చేసి మళ్లీ వ్యాపారులకు అనుమతులిస్తున్నారనే వాదనలు బలంగానే ఉన్నాయి.

### అమ్మినోడికి కోట్ల ఆదాయం.. తాగినోడికి సమాధి

రియల్ ఎస్టేట్తోపాటు సాగు భూమి విస్తీర్ణం పెరిగిన నేపథ్యంలో సహజ సిద్ధమైన చెట్ల కల్లు విక్రయాలు తక్కువయిపోయాయనే అభిప్రాయాలు ఉన్నాయి. తాగే వారి సంఖ్య అధికంగా ఉండటంతో ఉన్న కల్లులోనే ఆల్ఫ్రాజోలం, డైజోఫాం, క్లోరోహైడ్రేట్ వంటి మత్తు పదార్థాలను కలిపి కృత్రిమ కల్తీ కల్లు తయారు చేస్తున్నారన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలనే ఆశతో రసాయనాలతో కల్తీ కల్లు తయారు చేసేవారు కోట్లు ఆర్జిస్తుండగా.. తాగిన వాళ్లకు చావే గతి అవుతున్నది. కల్తీ కల్లు మాఫియా రాజకీయ పార్టీల్లో ప్రాబల్యం పెంచుకుంటూ, అధికారులను మచ్చిక చేసుకుని తమ దందా నిరాటకంగా కొనసాగిస్తున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు 10 లీటర్ల సహజ సిద్ధమైన కల్లులో పదిరెట్లకు మించి నీళ్లు కలిపి అందులో మోతాదుకు మించి మత్తు పదార్థాన్ని కలుపడం వల్ల కల్లు ప్రియులు రోగాల బారిన పడుతున్నారు. మహారాష్ట్ర నుంచి ఎక్కువగా కల్తీ కల్లు రసాయనాలు వస్తున్నాయని సమాచారం. కల్తీ కల్లు దందాను నియంత్రించాల్సిన ఎక్సైజ్ అధికారులు ఆడపాదడపా అక్కడక్కడ దాడులు చేసి, ఒకటో, రెండో కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారని, దీంతో కల్లు డిపోలు, షాపుల్లోనే కాకుండా ఎక్కడ పడితే అక్కడ కల్తీ కల్లును అమ్ముతున్నారని తెలుస్తున్నది. అచ్చంగా కల్లు మాదిరిగానే కనిపించే కృత్రిమ కల్లుకు అలవాటు పడిన వారు స్వచ్ఛమైన కల్లు తాగినా..మత్తు ఎక్కడం లేదని గోల చేస్తుంటారు. మద్యం ధరలు ఎక్కువగా ఉండటంతో పేదలు, రోజువారీ కూలీలు ఈ కల్లు వైపే మొగ్గు చూపుతున్నారు.కానీ..అదే వారికి కొన్ని సందర్భాల్లో శాపంగా పరిణమిస్తున్నది.

# పురోగతిలో అమెరికాతో వాణిజ్య చర్చలు

న్యూఢిల్లీ,అమెరికాతో వాణిజ్య చర్చలు నడుస్తున్నాయని వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్ గురువారం తెలిపారు. భారతదేశం-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో అగర్వాల్ ముఖ్య సంధానకర్తగా ఉన్నారు. ఇప్పటికే పలుమార్లు అమెరికాతో వాణిజ్య చర్చలు జరిపారు. త్వరలోనే ఒక కొలిక్కి అవకాశం ఉన్నట్లు- కనిపిస్తోంది. వాస్తవానికి ట్రంప్ విధించిన డెడ్‌లైన్ గడువు జూలై 9తో ముగిసిపోయింది. అయితే కొన్ని దేశాలకు ఆగస్టు 1 వరకు గడువు పొడిగించారు. అయితే అమెరికా.. భారత్‌లో వ్యవసాయం, పాడి పరిశ్రమపై మినహాయింపులు కోరుతోంది. ఈ రెండు కూడా భారతదేశంలో చాలా సెంటిమెంట్. ఈ నేపథ్యంలోనే ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చలు సందిగ్ధంలో పడ్డాయి.తాజాగా ఇదే అంశంపై గురువారం రాజేష్ అగర్వాల్ స్పందించారు. ఎగుమతి లాజిస్టిక్స్‌పై జరిగిన కార్యక్రమంలో అగర్వాల్ వాణిజ్య ఒప్పందాలపై మాట్లాడారు. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి భారతదేశం ప్రయత్నిస్తోందని చెప్పారు. ఈ ఒప్పందం యొక్క మొదటి దశను సెప్టెంబర్-అక్టోబర్ నాటికి ముగించడానికి లక్ష్యంగా పెట్టు-కున్నట్లు- చెప్పారు. భారతదేశం ఇప్పటి వరకు 26 దేశాలతో 14కి పైగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు అమలు చేసిందని అగర్వాల్ అన్నారు. ప్రస్తుతం ప్రధాన మార్కెట్లతో అనుసంధానం అవుతున్నామని.. ఇప్పటికే యూకేతో ఒక ఒప్పందాన్ని ముగించినట్లు- పేర్కొన్నారు. యూరోపియన్ యూనియన్‌తో కూడా చర్చల దశలో ఉన్నట్లు- తెలిపారు.ఇక భారతదేశం.. చిలీ, పెరూ వంటి లాటిన్ అమెరికన్ దేశాలతో కూడా వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరుపుతున్నట్లు- చెప్పుకొచ్చారు. ఆస్ట్రేలియా, యూఏఈలతో వాణిజ్య ఒప్పందాలు ఉన్నాయని.. న్యూజిలాండ్‌తో కూడా చర్చలు జరుపుతున్నట్లు- వెల్లడించారు. ప్రధాన ఆర్థిక వ్యవస్థలతో పెద్ద ఎత్తున ఒప్పందాలు చేసుకోబోతున్నట్లు- ఆయన చెప్పుకొచ్చారు. ప్రిల 2న ట్రంప్.. ఆయా దేశాలపై సుంకాలు విధించారు. అయితే ఆయా దేశాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవ్వడంతో ఈ నిర్ణయాన్ని మూడు నెలల పాటు-తాత్కాలికంగా వాయిదా వేశారు. అయితే ఆ డెడ్‌లైన్ మొన్న జూలై 9తో ముగిసింది. ఈ మేరకు ఆయా దేశాలను హెచ్చరిస్తూ లేఖలు కూడా రాశారు. ఇక రెండు మిత్ర దేశాలకు ఇప్పటికే సుంకాలు విధించారు. మిగతా దేశాలకు ఆగస్టు 1 వరకు గడువు విధించారు. ఈలోపు అమెరికాతో ఒప్పందాలు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం అమెరితో యూకే, వియత్నాం మాత్రమే ఒప్పందాలు చేసుకున్నాయి. చైనా మాత్రం పరస్పరం తాత్కాలింగా తగ్గించుకోవాలని నిర్ణయం తీసుకున్నాయి.

# మార్కులు తక్కువొచ్చాయని ఆవేదన వద్దు

పుట్టపర్తి,గురుపౌర్ణమి నాడు పుట్టపర్తిలో మెగా పీటీఎమ్ కార్యక్రమం జరగడం సంతోషంగా ఉందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. పుట్టపర్తిలోని కొత్తచెరువు జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన మెగా పీటీఎంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల్లో రాజకీయాలు ఉండవని.. బడి గేటు బయటనే పాలిటిక్స్ అని చెప్పుకొచ్చారు. ఒక్క మార్కు తక్కువ వస్తే విద్యార్థులు సూసైడ్ చేసుకుంటున్నారని... ఇలా చేయడం తప్పని.. పట్టుదలతో చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని మంత్రి సూచించారు. సవాళ్లు ఎదుర్కోవడం అంటే తనకు ఇష్టమన్నారు. విద్యాశాఖలో లీప్ యాప్ తీసుకొచ్చామని.. దీన్ని పేరెంట్స్ అందరూ డౌన్‌లోడ్ చేసుకొని అందులో ఉండే పిల్లల వివరాలు, విద్యా ప్రమాణాలు తెలుసుకోవచ్చన్నారు. ఈ యాప్ ద్వారా ప్రభుత్వానికి సూచనలు కూడా చేయవచ్చన్నారు. డ్రగ్స్ వల్ల క్యాన్సర్ వస్తుందని... అందుకే డ్రగ్స్ వద్దు బ్రో అని పిలుపునిచ్చారు. అమ్మంటే రెండు అక్షరాలు కాదని.. అమ్మను గుండెల్లో పెట్టుకుని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తాను విద్యాశాఖ మంత్రి అవగానే ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన దుస్తులు, పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. పిల్లలు ఇంటికి వచ్చాక చదువుపై పేరెంట్స్ బాధ్యతగా ఉండాలని సూచించారు. అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు నిచ్చారని.. విద్యాశాఖ ఆధ్వర్యంలో కోటి మొక్కలు నాటుతామని వెల్లడించారు. ప్రతి మొక్కకు గ్రీన్ పాస్ పోస్ట్ ఇస్తున్నామని తెలిపారు. గ్రీన్ పాస్ పోస్ట్ ద్వారా మొక్క పరిస్థితిని తెలుసుకోవచ్చన్నారు. 2019లో మంగళగిరిలో ఓడిపోయానని... కానీ కసితో కష్టపడి 2024లో భారీ మెజార్టీతో విజయం సాధించానని అన్నారు. చిత్తూరు జిల్లాలో ఓ యువతిపై జరిగిన సంఘటన తనను కలచి వేసిందన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో శ్రీ సత్యసాయి జిల్లాకు మురళీ నాయక్ మృతి చెందారని మంత్రి నారా లోకేశ్ అన్నారు.

## మల్నాడు డ్రగ్ పార్టీ కేసులో దర్యాప్తు ముమ్మరం

హైదరాబాద్,మల్నాడు రెస్టారెంట్ డ్రగ్ పార్టీ కేసులో ఈగిల్ టీమ్ దర్యాప్తును ముమ్మరం చేసింది. 9 పబ్స్ పైన ఈగల్ కేసులు నమోదు చేసింది. ఇప్పటికే, పబ్బుల యజమానులకు నోటీసులు జారీ చేసింది. వచ్చే వారం తమ ఎదుట హాజరు కావాలని పబ్బు యజమానులకు నోటీసులు అందజేశారు. మల్నాడు రెస్టారెంట్ సూర్యతో ముగ్గురు పబ్ యజమానులతో సంబంధాలు ఉన్నట్లు- సమాచారం. మూడు పబ్స్ యజమాలతో కలిసి డ్రగ్ పార్టీలు నిర్వహించినట్లుగా ఈగల్ టీమ్ గుర్తించింది. అయితే, పబ్బుల్లో డ్రగ్స్ పార్టీ కోసం ప్రిజం పబ్, ఫామ్ పబ్, బర్డ్ బాక్స్ పబ్, బ్లాక్ 22 పబ్, వాక్ కోరా పబ్, బ్రాడ్ వే పబ్స్ కు చెందిన యాజమాన్యాలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. అయితే, వాక్ కోరా పబ్, బ్రాడ్ వే పబ్, బ్రాడ్ వే యజమానులపై పోలీసులు కేసు నమోదు చేశారు. క్వాక్ పబ్ రాజా శేఖర, కోరా పబ్ పృధ్వి వీరమాచినేని, బ్రాడ్ వే పబ్ ఓనర్ రోహిత్ మాదిశెట్టిలపై కేసు నమోదు చేసినట్లు- తెలిపారు. ఈ ముగ్గురు పబ్బు యజమానులతో కలిసి డ్రగ్ పార్టీలు నిర్వహించినట్లు- సూర్య పేర్కొన్నారు.

## తుంగభద్రకు తగ్గిన ఇన్‌ఫ్లో

కర్నూలు,తుంగభ జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గడంతో 8 క్రస్ట్‌గేట్లు క్రిందకు దించి కేవలం 13క్రస్ట్‌గేట్ల గుండా మాత్రమే దిగువకు వరదనీరు విడుల చేస్తున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. తుంగభద్ర పై భాగం ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టటడంతో తుంగభద్ర జలాశయానికి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో బుధవారం అధికారులు 8 క్రస్ట్‌గేట్లను మూసేశారు. బుధవారం సాయంత్ర 4గంటల సమయానికి అధికారులు సేకరించిన సమాచారం మేరకు ప్రస్తుతం జలాశయం ఎత్తు 1624.78 అడుగులకు నీటి మట్టం చేరుకోగా, జలాశయానికి 46,270 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. వివిధ సాగునీటి కాలువలకు వదులుతుండగా, జలాశయం 13క్రస్ట్‌గేట్లలో ఒక్కో గేటు-2.5అడుగులు చొప్పు ఎత్తి 36,699 క్యూసెసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు- బోర్డు అధికారులు వివరించారు. ప్రస్తుతం జలాశయంలో 75.77 టీ-ఎంసీల నీరు నిలువ ఉంచి. గత ఏడాది ఇదే సమయానికి 51,955 క్యూసెక్కుల వరద నీరు జలాశయానికి వచ్చి చేరుతుండగా 23.079 టిఎంసి

# వర్షాలతో సీజనల్ వ్యాధుల భయం

శ్రీకాకుళం, ఏటా వానా కాలంలో వ్యాధుల ముప్పు పెరిగి పేదల జీవితాలు దుర్భరమవుతున్నాయి. మలేరియా, డెంగ్యూ, చికున్‌గు న్యా, మెదడువాపు, ఫైలేరియా, అతిసారం, టైఫాయిడ్, తదితర సీజనల్ వ్యాధులు గ్రామీణులను తీవ్రంగా వేధిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండే చోట దోమలు వృద్ధి చెందే అవకాశమున్నందున పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని వైద్యారోగ్య శాఖ ఏటా హెచ్చరిస్తూనే ఉంది. ఇందుకు సంబంధించి ఇటీవల ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులతో పాటు, కరోనా నియంత్రణ చర్యలను కూడా ఏకకాలంలో కొనసాగించాలని వైద్య ఆరోగ్యశాఖల అధికారులకు సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీటిసంబంధిత, కీటక సంబంధిత వ్యాధులు ప్రబలుతున్నందున్న జాగ్రత్తగా ఉండాలని ఆయా శాఖలను ఆదేశించారు. ఏజెన్సీ గ్రామాల్లో ఉన్న సామాజిక, భౌగోళిక వైరుధ్యాల కారణంగా యేటా వానాకాలంలో అంటు వ్యాధులతో పాటు డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాలు కూడా ప్రబలడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది. మలేరియా మహమ్మారి మళ్లీ విజృంభిస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ గుర్తించింది. సమస్యాత్మక ప్రాంతాల జాబితాతో.. ఈ నేపథ్యంలోనియంత్రణ చర్యలు చేపట్టాలని ఇప్పటికే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. మలేరియా, డెంగ్యూ జ్వరాలతో బాధితులు మరణించినట్లు అధికారికంగా రికార్డు కాకపోయినా ఏజెన్సీలో ఎలాంటి డయాగ్నసిస్ చేయని కేసులే అధికంగా ఉన్నాయంటున్నారు. కాగా వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నియంత్రణ పై దృష్టి సారించామని చెబుతున్నా మారుమూల గ్రామాల్లో రవాణా సరిగ్గా లేని కారణంగా సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి శాంపిల్స్‌ను సేకరించే పరిస్థితులు అంతంత మాత్రమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాంతో చాలా మంది జ్వరాల బారిన పడిన రోగులు అందుబాటులో ఉండే ఆర్ఎంపీలు, సాంప్రదాయ నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తూ ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఏజెన్సీలో మలేరియా వంటి వ్యాధుల నియంత్రణ కోసం ఆదివాసీ గ్రామాల్లో వేల దోమ తెరలను పంపిణీ చేశారు. మారుమూల అటవీ గ్రామాల్లో ప్రతి సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ఉత్పన్నమవుతోంది. అత్యంత సమస్యాత్మక ప్రాంతాలకు సిబ్బంది కనీసం కాలినడకన వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. వర్షాకాలంలో వాగులు, వంకలు దాటుకుంటూ అక్కడి చేరుకోవడం వైద్య సిబ్బందికి కత్తిమీద సాములా మారింది.

# భద్రాద్రి అభివృద్ధికి చర్యలు ఏవీ

భద్రాద్రి, యాదాద్రి తరహాలోనే భద్రాద్రిని కూడా అద్భుత పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దే సంకల్పానికి మహూర్తం కుదరడం లేదు. మరోవైపు పోలవరంతో భద్రాద్రికి ముప్పు అన్న ఆందోళన వస్తోంది. ఈ రెడు విషయాలపై ఎలాంటి స్పందనా కానరావడం లేదు. మరోవైపు భద్రాద్రి రక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. భద్రాచలం ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్‌ప్లాన్ రూపకల్పన పై గతంలో మంత్రి తుమ్మల అధికారులతో చర్చించారు. పలుసూచనలు చేశారు. ఆలయ అధికారులు, దేవస్థానం పండితులు, స్తపతులతో కలిసి భద్రాద్రి అభివృద్ధి మాస్టర్ ప్లాన్ గురించి చర్చించారు. కానీ అవన్నీ పక్కకుపోయాయి. తుమ్మల రాజకీయంగా మళ్లీ తెరపైకి వచ్చారు. ఈ క్రమంలో ప్రస్తుతం మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని స్థానికులు కోరుతున్నారు. యాదాద్రిలాగా కాకాపోయిన కొంతయినా చేసి భద్రాద్రిని పునర్నించాలని కోరుతున్నారు. భద్రాద్రి ఆలయాన్ని జాతీయస్థాయిలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దాలన్నదే తెలంగాణ ప్రభుత్వ సంకల్పంగా ఉందని నాటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఇక్కడ ఏటా శ్రీరామ నవమి, సీతారామ చంద్రస్వామి కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. అయినా ఆలయ అభివృద్ధి ప్రణాళిక మాత్రం ముందుకు సాగడం లేదు. ఆలయ అభివృద్ధిని చేపట్టి భద్రాద్రినిపర్యాటకకేంద్రంగా తీర్చి దిద్దాలని స్థానికులుకోరుతున్నారు.

# వైసీపీయే దిక్కా?

విజయవాడ:2024 ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాభవం తర్వాత ఒక్కొక్కరు మెల్లగా ఆ పార్టీకి దూరమయ్యారు. చిన్నా, పెద్దా చాలామంది నాయకులు జగన్ ని విమర్శించి పక్కకు వెళ్లిపోయారు. అలా వెళ్లిన వారిలో ఇద్దరు కీలక నేతలు విజయసాయిరెడ్డి, బాలినేని శ్రీనివాసులరెడ్డి. ఒకరు జగన్ కి దగ్గరి బంధువు అయితే, మరొకరు ఆత్మబంధువు లాంటివారు. ఇద్దరూ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చక్రం తిప్పారు, అధికారం పోగానే వివిధ కారణాలు వెదుక్కుని మరీ జంప్ అయ్యారు. అయితే వీరిద్దరికీ బయట ఉక్కపోతగానే ఉంది. అలాగని నిన్న వెళ్లిపోయి ఈరోజు తిరిగి రావడమంటే మరీ అవమానం. అందుకే ఆలోచిస్తున్నట్టున్నారు. ఇప్పటి వరకు దీన్ని కేవలం పుకారు అనుకున్నా.. రాబోయే రోజుల్లో ఇదే నిజం అయ్యే అవకాశాలను కొట్టిపారేయలేం.

వ్యవ'సాయి'రెడ్డి పరిస్థితి ఏంటి..?

రాజ్యసభ సభ్యత్వానికి, పార్టీకి ఏకకాలంలో రాజీనామా చేశారు విజయసాయిరెడ్డి. ఆయన ఎగ్జిట్ ఎవరూ ఊహించనిది. ఎందుకంటే.. వైఎస్ఆర్ తోనూ, జగన్ తోనూ ఆయనకున్న అనుబంధం అలాంటిది. అయితే 2024 ఎన్నికలకు ముందే విజయసాయిరెడ్డికి వైసీపీలో ఎదురుదెబ్బలు తగిలాయి. రాజ్యసభ సభ్యుడిగా హ్యాపీగా ఉన్న ఆయన్ను తీసుకొచ్చి నెల్లూరు ఎంపీగా పోటీ చేయమన్నారు. ఇష్టం లేకపోయినా ఆ బాధ్యత భుజాన వేసుకుని పోటీ చేసి ఘోరంగా ఓడిపోయారు. ఇక పార్టీలో సజ్జల ప్రాబల్యం పెరిగిపోవడం కూడా విజయసాయికి ఇబ్బందిగా మారింది. దీంతో ఆయన కోటరీ అంటూ వ్యాఖ్యలు చేసి బయటకు వెళ్లిపోయారు. ఇతర పార్టీలో చేరతారనే ప్రచారం జరిగినా, తాను వ్యవసాయానికే పరిమితం అవుతానని ఖరాఖండిగా చెప్పారాయన. కానీ ఆ పని కూడా మొదలు పెట్టలేదు. ఆయన ప్రయాణం రాజకీయమేనని తేలిపోయింది. అయితే విజయసాయిరెడ్డికి ఇతర పార్టీల్లో అవకాశం ఉండదు అనే విషయం కూడా తేలిపోయింది. దీంతో ఆయన తిరిగి వైసీపీ గూటికి చేరతారనే ప్రచారం జరుగుతోంది. జగన్ తో ఆయన కలసి ఉన్న పాత ఫొటోలను కొత్తగా వైరల్ చేస్తున్నారు. మరోవైపు వైసీపీనుంచే సోషల్ మీడియాలో కౌంటర్లు పడుతున్నా.. ఆ పార్టీలోకి విజయసాయి రీఎంట్రీని మాత్రం కొట్టిపారేయలేం.

బాలినేని దారెటు..?

2024 ఎన్నికల తర్వాత కూటమి విజయం ఈవీఎంల విజయం అంటూ రచ్చ చేశారు బాలినేని శ్రీనివాసులరెడ్డి. కోర్టులో కేసులు కూడా పెట్టారు. అలాంటి బాలినేని రోజుల వ్యవధిలోనే వైసీపీకి గుడ్ బై చెప్పేసి జనసేన కండువా కప్పుకున్నారు. కానీ జనసేనలో ఆయనకు పెద్ద ప్రయారిటీ దక్కలేదు. ఇటు ప్రకాశం జిల్లాలో బాలినేనికి టీడీపీతో పాత గొడవలున్నాయి. అవి కూడా ఇంకా సద్దుమణగలేదు. బాలినేనిని జనసేన నేతగా ఎవరూ గుర్తించడం లేదు. దీంతో ఆయన ఆ పార్టీతో అంటీముట్టనట్టుగానే ఉన్నారు. ఇటీవల ప్రకాశం జిల్లా పర్యటనకు వచ్చిన డిప్యూటీసీఎం పవన్ కల్యాణ్ ని బాలినేని కలసినా పెద్ద హడావిడి లేదు. ఇలాంటి దశలో బాలినేని తిరిగి వైసీపీ గూటికి చేరతారనే పుకార్లు మొదలయ్యాయి. అంటే ఇక్కడ బాలినేనికి వైసీపీ మినహా వేరే ఆప్షన్ లేదు అనే విషయం తేలిపోయింది.

# భాజపా వ్యూహాత్మక అడుగులు...



అమరావతి,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచీ నేటి నవ్యాంధ్ర వరకు రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ రాజకీయ ప్రస్థానం ఎన్నో ఎత్తుపల్లాలు చూసింది. 2024 ఎన్నికల తరవాత రాష్ట్రంలో ఆ పార్టీ వేస్తున్న ప్రతి అడుగులోనూ స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలు రాబట్టగల స్పష్టమైన వ్యూహం కనిపిస్తోంది. తాజాగా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ నియామకం ద్వారా సంస్థాగత నిర్మాణంపై భాజపా దృష్టి సారించింది.ఆంధ్రప్రదేశ్‌లో భాజపా రాజకీయ బలాన్నీ, దాని ముందున్న సవాళ్లనూ అర్థం చేసుకోవాలంటే– కూటమితో ఉన్నప్పుడు, ఒంటరిగా పోటీ చేసినప్పుడు ఆ పార్టీకి లభించిన ఓట్ల శాతాలను విశ్లేషించడం ముఖ్యం. రాష్ట్ర విభజనకు ముందు, 1983 శాసనసభ ఎన్నికల్లో భాజపా తన ప్రస్థానాన్ని ప్రారంభించింది. ఆ ఎన్నికల్లో కాషాయపార్టీ 2.76శాతం ఓట్లతో మూడు స్థానాలు గెలుచుకుంది. తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకున్న 1999 ఎలక్షన్లలో భాజపా పనితీరు గణనీయంగా మెరుగుపడింది. నాడు 12 శాసనసభ స్థానాలు(3.67% ఓట్లు), ఏడు లోక్‌సభ స్థానాలు(9.91% ఓట్లు) సాధించి రికార్డు సృష్టించింది. కానీ, ఆ తరవాత దాని రాజకీయ గ్రాఫ్ క్రమంగా తగ్గుముఖం పట్టింది. రాష్ట్ర విభజన అనంతరం, 2014 ఎన్నికల్లో దేశవ్యాప్తంగా వీచిన మోదీ ప్రభంజనం, తెదేపా, జనసేనలతో పొత్తు భాజపాకు బాగా కలిసొచ్చింది. అప్పుడు నాలుగు శాసనసభ స్థానాలు(2.2% ఓట్లు), రెండు లోక్‌సభ స్థానాలు(7.22% ఓట్లు) గెలుచుకుని రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామి అయ్యింది.

పాఠం నేర్పిన ఓటమి

2019 ఎన్నికలు భాజపాకి అత్యంత గడ్డు కాలాన్ని మిగిల్చాయి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించే విషయంలో తలెత్తిన విభేదాలతో తెదేపా దూరం కావడంతో ఒంటరిగా పోటీ చేసిన భాజపా ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఒక్క శాసనసభ స్థానాన్ని కూడా గెలవలేకపోగా, కేవలం 0.84శాతం ఓట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆ పార్టీ నుంచి పోటీ చేసిన 173 మంది అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. లోక్‌సభ స్థానాల్లోనూ ఖాతా తెరవలేకపోయింది. రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాల్లో కలిపి 0.98 శాతం ఓట్లే తెచ్చుకోగలిగింది. ఈ ఫలితంతో– ఆంధ్రప్రదేశ్‌లో భాజపా రాజకీయ మనుగడకు మిత్రపక్షాల మద్దతు ఎంత కీలకమో స్పష్టంగా తెలియవచ్చింది.దాంతో, 2024 ఎన్నికలకు వచ్చేసరికి భాజపా అధిష్ఠానం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కుమార్తె, చంద్రబాబు నాయుడి వదిన అయిన దగ్గుబాటి పురందేశ్వరిని పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలిగా నియమించింది. తద్వారా తెదేపాతో దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించేందుకు అనువైన రాజకీయ వాతావరణాన్ని సృష్టించింది. అంతర్గతంగా ఆమె అనుసరించిన వ్యూహాత్మక సమన్వయం– పార్టీలోని భిన్న వర్గాల విధేయతలను తిరిగి భాజపా వైపు మళ్లించడానికి దోహదపడింది. తెదేపా–జనసేనల మధ్య పొత్తు, సీట్ల సర్దుబాటు చర్చల్లో పురందేశ్వరి వ్యవహారశైలి కీలక పాత్ర పోషించింది. ఈ వ్యూహాత్మక ఎత్తుగడల ఫలితంగా 'కూటమి' భాగస్వామ్యంతో 2024 ఎన్నికల్లో భాజపా అద్భుతమైన పునరాగమనం చేసింది. ఎనిమిది శాసనసభ స్థానాలు గెలుచుకుంది. అలాగే, ఆరు లోక్‌సభ స్థానాల్లో పోటీచేసి మూడింటిని కైవసం చేసుకుంది. శాసనసభ స్థానాల్లో 2.83శాతం, లోక్‌సభ స్థానాల్లో 11.28శాతం ఓట్లు సాధించింది.

సైద్ధాంతిక క్షేత్రంలో పోటీ

ప్రస్తుతం భాజపా ఒకేసారి రెండు లక్ష్యాలతో ద్విముఖ వ్యూహాన్ని అనుసరిస్తోంది. స్వల్పకాలిక మనుగడ కోసం కూటమిలో కొనసాగుతూనే, దీర్ఘకాలంలో సొంతంగా బలపడటానికి పునాదులు వేసుకుంటోంది. ఇందులో భాగంగానే, లోక్‌సభ సభ్యురాలిగా ఎన్నికైన పురందేశ్వరి స్థానంలో– ఎలాంటి ఆర్భాటాలూ లేని, సంస్థాగత నిర్మాణంపై మంచి పట్టున్న పీవీఎన్ మాధవ్ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడయ్యేలా అధిష్ఠానం పావులు కదిపింది. ఆయన తప్ప మరెవరూ అధ్యక్ష స్థానం కోసం తలపడలేదు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా, మాజీ ఎమ్మెల్సీగా, ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లిన దివంగత చలపతిరావు కుమారుడిగా మాధవ్‌కు బలమైన నేపథ్యమే ఉంది. ఆయన నిబద్ధత, నిరాడంబర వ్యక్తిత్వం సంస్థాగత నిర్మాణంలో పార్టీకి కలిసి వస్తాయని అధిష్ఠానం విశ్వసిస్తోంది. అయితే, కొత్త అధ్యక్షుడి ముందున్న మార్గం అంత సులభమైనదేమీ కాదు. భాజపా జాతీయ అజెండాలోని 'వికాస్ (అభివృద్ధి)' నినాదాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన సీఈవో ఇమేజ్‌తో సొంతం చేసుకున్నారు. రాజధాని అమరావతి వంటి బృహత్ ప్రాజెక్టులతో ఆయన అభివృద్ధి ఎజెండాను నడిపిస్తున్నారు. మరోవైపు, హిందూత్వ సైద్ధాంతిక క్షేత్రంలో– ఉపముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ 'సనాతన ధర్మ పరిరక్షకుడి'గా తనను తాను నిలబెట్టుకుంటున్నారు. ఈ పరిస్థితులు రాష్ట్రంలో భాజపాను ఒక రకంగా నిష్క్రియాత్మక పాత్రలోకి నెడుతున్నాయి. కూటమిలోని బలమైన భాగస్వామి అయిన తెదేపాను ఇబ్బంది పెట్టకుండా, తన సొంత అజెండాను దూకుడుగా ముందుకు తీసుకెళ్లలేని స్థితిలో ఆ పార్టీ ఉంది. కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో కాషాయ పార్టీకి ప్రత్యేక గుర్తింపునిచ్చే ప్రధాన సైద్ధాంతిక అంశాలను, ఏపీలో దాని మిత్రపక్షాలే బలంగా ఆక్రమించాయి.

నెమ్మదిగా విస్తరించడానికి...

భాజపా వ్యూహం 'సైద్ధాంతిక పరిచయం' (ఐడియలాజికల్ ఫెమిలరైజేషన్) అనే సహనంతో కూడిన పంథాలో సాగుతున్నట్లే కనిపిస్తోంది. అధికార కూటమిలో భాగస్వామిగా ఉంటూనే రాష్ట్రంలో తన ఉనికిని క్రమంగా విస్తరించుకుంటోంది. విశాఖపట్నంలో జరిగిన యోగా దినోత్సవం వంటి కార్యక్రమాలను– పార్టీ సాంస్కృతిక జాతీయవాదాన్ని తెలుగు ప్రజల చైతన్యంలోకి నెమ్మదిగా చొప్పించడానికి చేస్తున్న 'సాఫ్ట్ పవర్' ఎత్తుగడలుగా చూడవచ్చు. భాజపా అధిష్ఠానం తన మిత్రపక్షాలను ముందుంచి, తక్షణ ఆధిపత్యం కంటే క్రమమైన ప్రజామోదం, సంస్థాగత విస్తరణపైనే దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది. పాపులర్, మాస్‌లీడర్ కంటే... మాధవ్ వంటి పూర్తిస్థాయి సంస్థాగత నాయకుడే క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణానికి మరింత సమర్థంగా పనిచేయగలరనే అధిష్ఠానం నమ్మకం వెనక అంతరార్థమిదే!

# నదీజలాల సద్వినియోగంపై చర్చించాలి !

అమరావతి/హైదరాబాద్,ఇరు రాష్ట్రాల మధ్య నదీజలాల విషయంలో స్పష్టమైన అవగాహనకు రావాల్సి ఉంది. నదీజలాలు ఏటా సముద్రంలో కలుస్తున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకునేందుకు ఉమ్మడిగా ప్రాజెక్టుకులను నిర్మించుకోవడం, నిర్వహించుకోవడం అవసరం.అలాగే వాన నీటిని ఒడిసి పట్టుకోవడంలో ఇరు ప్రభుత్వాలు శ్రద్ద చూపాలి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు వాననీటిని వృధాగా పోకుండా ఉమ్మడిగా ప్రణాళికలు సిద్ధంచేయాలి. ఇటీవల కృష్ణా,గోదవారి బోర్డుల్లో పరస్పర ఫిర్యాదులతో నీటి పంచాయితీలను కొనసాగించారు. తాజాగా బనకచర్ల పేరుతో పంచాయితీ మొదలయ్యింది. ఇలా ఎవరిక వారు కాకుండా, కలసి నదీజలాల సద్వినియోగంపై ఇరు రాష్ట్రాలు చర్చించాలి. ఉమ్మడి ప్రయోజనాలు ఆశించాలి. పరస్పర నిందలతో లాభం లేదని గుర్తించాలి కృష్ణ, గోదావరిల నుంచిచుక్కనీరు సముద్రంలో కలవకుండా చూసుకోవాలి. అంతేత్ప రాజకీయప్రయోజనాల కోసం పరస్పరం దుమ్మెత్తి పోసుకోవడం తగదు. ఇది వాంఛనీయం కూడా కాదు. ఇటీవల మరోమారు తెలుగు రాష్ట్రాల సిఎంలు కూర్చుని విభజన సమస్యలను ప్రస్తావించారు. పరస్పర అవగాహనతో ముందుకు పోతామని ప్రకటించారు. అదే సందర్భంలో జలవనరుల విసయంలో పరస్పర అవగాహన అవసరం. సున్నితమైన సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సుహృద్భావం ఉండాలే తప్ప రెచ్చగొట్టే విధానాలు సరికాదు. విపక్షాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే పరిస్థితి రాకుండా చూడాలి. ఉభయ ప్రభుత్వాలు వీలున్నంత త్వరగా సామరస్యంగా జల వివాదాలను పరిష్కరించుకుని ఇటు రాయలసీమ అటు తెలంగాణలోని కరువు ప్రాంతాలకు నీటిని తరలించే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలి. ఇందులో ప్రదానంగా గోదావరి, కృష్ణాల నుంచి వృధాగా సముద్రంలో కలుస్తున్న నీటిని వినియోగించడంపై నిపుణులతో చర్చించాలి. విభజనకు ముందువరకు కలసి వున్న మనం ఇప్పుడు జగడాలు పడడం తగనిపనిగా పాలకలు,రాజకీయ పార్టీలు,నేతలు గుర్తించాలి. సమస్యలను ఎగదోసే రాజకీయ పార్టీల నేతల తీరును ఎండగట్టాలి. పొరుగు రాష్ట్రాలతో గొడవలు వద్దనుకుంటున్న ఇరు తెలుగు రాష్ట్రాల సిఎంలు ఈ విషయంలో హుందాగానే ఉంటున్నందున సమిష్టిగా సమస్యలను పంచుకోవాలి. తెలంగాణ మంత్రులు కూడా సంయమనంతో సమస్యలను చర్చించాలి. ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో మన బంధాలు బలపడాలి. ప్రభుత్వాలు తమ వాటా నికర జలాలకు కట్టుబడి ఉంటూ, మిగులు జలాలను ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్ప భావోద్వేగాలు రెచ్చ గొట్టడం వాంఛనీయం కాదు. నిజానికి కృష్ణా,గోదావరి చివరి బేసిన్‌లో ఉన్నవి తెలుగు రాష్ట్రాలే. ఈ రెండు రాష్ట్రాలు ఈ నీటిని ఎలా ఉపయోగించుకోవాల అన్నది నిర్ణయించుకోవాలి. దీనిద్వారా ఇరు రాష్ట్రాల రైతాంగం బాగుపడుద్ది. సముద్రంలోకి నీరు వృధాగా పోకుండా ఉమ్మడిగా ప్రాజెక్టులను నిర్మించకునే అవకాశాలను పరిశీలించాలి. ఘర్షణల వల్ల నష్టపోయేది రెండు రాష్ట్రాల్లోని తెలుగు ప్రజలే అని గమనించాలి.కేంద్రం కూడా బోర్డులు ఏర్పాటు చేసినా ఫలితం కానరావడం లేదు. సమస్యలను పెద్దవిగా చేయకుండా పరిష్కరించే మార్గాలను చూపుతూ శాశ్వతంగా సమస్యలకు చెక్ పెట్టగలగాలి. ఆల్మట్టి,నారాయణపూర్ ప్రాజెక్టుల కారణంగా కృష్ణా నది కిందనున్న ప్రాజెక్టులకు ఇప్పటికే నీరు సక్రమంగా అందడం లేదు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కర్ణాటక, మహారాష్ట్రలకు కేటాయించిన అదనపు జలాలను వారు వినియోగించుకుంటే ఉభయ తెలుగు



రాష్ట్రాలకు మిగులు జలాలు కాదుకదా బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన నికర జలాలకు కూడా గ్యారంటీ ఉండదు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కృష్ణాజలాల్లో తమ వాటాగా ఉన్న నికరజలాలకు గ్యారంటీని పొందడంతో పాటు బచావత్ ట్రిబ్యునల్ చెప్పిన పద్ధతిలో మిగులు జలాలను వినియోగించుకునే హక్కును తెలుగు రాష్ట్రాలు కాపాడు కోవాలి. ఇందుకోసం ముందుగా ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య పరస్పర విశ్వాసం, అవగాహన ఉండాలి. ఇరు రాష్ట్రాలు ఉమ్మడిగా కేంద్ర పెత్తనాన్ని ఎదుర్కోవలసి ఉంది. ఎవరివాటాలను వారు వాడుకునే విధంగా నడుచుకోవాలి. వివాదాన్ని కేంద్రమే పరిష్కరించాలని కోరడమనేది శత్రువుకు జుట్టు ఇచ్చినట్లు అవుతుంది. నీటి సమస్యలు భావోద్వేగాలను తీవ్రతరం చేయడం సరికాదు. అనేక సమస్యలను పరిష్కరించ లేని కేంద్రం ఇక జల వివాదాలను సరిదిద్దుతుందన్న నమ్మకం లేదు. అందువల్ల ఉన్న ఒప్పందాల మేరకు నడుచుకునే విధంగా తెలుగు రాష్ట్రాల సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు కూర్చుని మాట్లాడి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి. పోతిరెడ్డిపాడు నుంచి కిందకు పూర్తిస్థాయిలో నీరు రావాలంటే శ్రీశైలంలో 881 అడుగులు నీళ్లు ఉండాలి. శ్రీశైలంలో పూర్తి నీటి మట్టం 885 అడుగుల నీళ్లు ఉన్న రోజులు గత 20 ఏళ్లలో ఏడాదిలో 20 నుంచి 25 రోజులు కూడా లేవు. ఇలాంటి సమయంలో పోతిరెడ్డిపాడుకు పూర్తి స్థాయిలో నీటిని తీసుకెళ్లలేని పరిస్థితి. మరోవైపు పాలమూరు రంగారెడ్డి, డిండి ప్రాజెక్టు, కల్వకుర్తి సామర్థ్యం పెంచి 800 అడుగులలోపే నీటిని తీసుకునే వెసులుబాటు తెలంగాణకు ఉందంటున్నారు. 796 అడుగుల వద్దే తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. 800 అడుగుల్లోపు లోనే మీకు కేటాయించిన నీటిని వాడుకుంటే తప్పులేనప్పుడు.. 881 అడుగులు ఉంటే తప్ప నీళ్లు వాడుకోలేని పరిస్థితి మాకున్నప్పుడు.. మేం 800 అడుగుల వద్దే మాకు కేటాయించిన నీటిని తీసుకోవడంలో తప్పేముందని ఎపి అధికారులు ప్రశ్నిస్తున్నారు. నిజానికి ఈ విషయాలపై స్పష్టత రావాలి. అలాగే రాజకీయంగా మరిన్ని చర్చలు చేయాలి. ఈ క్రమంలో నదీ జలాల పంపిణీ, నీటి పారుదల ప్రాజెక్టుల నిర్వహణ విషయమై రెండు తెలుగు రాష్ట్రాల మధ్య మరింత లోతుగా చర్చలు సాగాలి. నిజానికి సమస్య ఎక్కడుందో ఆలోచించాలి. ప్రజలకు తాగునీరు, సాగు అవసరాలు, జల విద్యుత్తు, పారిశ్రామిక అవసరాలు... ఇలా నీటి వినియోగ ప్రాధాన్యతలు అంతర్జాతీయ సూత్రాలకు అనుగుణంగా నిర్ణయించబడి ఉన్నాయి. ఆయా నియమాలను పాటిస్తూ, ఏవైనా ప్రత్యేక పరిస్థితులు ఏర్పడితే సర్దుబాటు చేసుకొని పరస్పరంగీకారంతో ఉమ్మడి ప్రాజెక్టులను నిర్వహించుకోవాలి. అప్పుడు కృష్ణా, గోదావరుల్లో మనకు ఉన్నంత నీరును సద్వినియోగం చేసుకోవచ్చు.

# అటవీ సంపదను పునరుద్ధరణకు చర్యలు

ఆదిలాబాద్, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం ప్రకారం పచ్చదనాన్ని 33 శాతానికి చేరాలంటే జిల్లాలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అధికారులు తెలిపారు. కేవలం ప్రభుత్వం ద్వారానే ఇది విజయవంతం కాదని, ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని అటవీ అధికారులు అన్నారు. అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగా చాలా చోట్ల అడవి తగ్గిపోయింది. పచ్చదనం కాస్తా కనుమరుగై మైదానాలను తలపిస్తోంది. ఆదిలాబాద్ జిల్లా అంటే ఒకప్పుడు సువిశాల అటవీ ప్రాంతం ఇప్పుడు కాస్తా అడవి హరించుకుపోవడంతో వర్షాలు లేక ఏటా అక్కడక్క డ అల్ప వర్షాపాతం సైతం నమోదు అవుతోంది. అటవీ సంపదను పునరుద్ధరించి ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి ప్రభుత్వాలు మొక్కలు నాటే కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. ఏటా లక్షలాది మొక్కలను నాటుతూ పల్లెల్లో పచ్చదనం వెల్లివిరిసే లా చూస్తోంది. ఈసారి వర్షాలు అంచనాలకు తగ్గట్లుగా కురిస్తే నాటిన మొక్క ల్లో 70నుంచి 80శాతం మొక్కలు బతికే వీలుంది. ఈసారి భారీగా మొక్కలు నాటేందుకు నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని ప్రభుత్వం భారీగా చేపట్టింది. గ్రామాలు, పట్టణాల్లో చైతన్యవంతులైన ప్రజలు మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములైతే సంకల్పం నెరవేరినట్లేనని అధికారులు భావిస్తున్నారు. టేకు మొక్కలతో పాటు వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు, యూకలిప్టస్, కానుగ, వేప, జామాయిల్ తదితర రకాల మొక్కలు కొద్ది రోజుల్లోనే నాటేందుకు సిద్ధం కానున్నాయి. మొక్కలు నాటడంలో కొన్ని శాఖలు విఫలం అయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈసారి మా త్రం అలాంటివి పునరావృతం కాకుండా పటిష్టవంతమైన చర్యలు తీసుకుంటున్నారు. నాటిన మొక్కలను బతికించుకునేందుకు ప్రభుత్వం ఈసారి ప్రత్యేకంగా దృష్టి సారించింది. వానలు సంవృద్ధిగా కురిసే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో నాటిన మొక్కలకు జీవం పోసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. వాతావరణంలో అసమానతలు తొలగించేందుకు పర్యావరణాన్ని రక్షించడంలో మొక్కలు పెంపకం తప్పనిసరి అని అటవీ అధికారులు తెలిపారు. పర్యావరన హితం కోసం మొక్కలు నాటడడంలో ప్రతి ఒక్కరూ మమేకం కావాలని అన్నారు. ఇది లాభాపేక్ష లేని కార్యక్రమంగా చూడాలన్నారు. వర్షాలు సకాలంలో రావాలన్నా ప్రజలంతా మొక్కల పెపంపకంలో భాగస్వాములు కావాలన్నారు. అధికారులు,ప్రజాప్రతినిధులు ఏదైనా గ్రామాన్ని దత్తతగా భావించి పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని అన్నారు. వ్యాపార దృక్పథంతో చూడకుండా సమాజానికి ఏదైనా పది కాలాల పాటు మేలు కలిగేలా ఉండే ఇలాంటి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని భావితరాలకు పచ్చదనం, ఆరోగ్యకర సమాజాన్ని అందించాలని అన్నారు. నేషనల్ హైవే అథారిటీ వారికి అటవీ శాఖ వారు మొక్కలు నాటడం చేపడుతారని తెలిపారు. నేషనల్ హైవే వెంబడి మొక్కలు పెద్ద ఎత్తున నాటడం జరుగుతుందని తెలిపారు.

# సకాలంలో రుణాలు అందక తంటాలు

కరీంనగర్,పంటరుణాల పంపిణీలో జగిత్యాల జిల్లాలో కనీసం 50శాతం మంది రైతులకు కూడా చేరడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మరోవైపు పంటరుణ పరిమితి అమలు లేకపోగా నిబంధనల ప్రకారం పంటరుణం తీసుకునే ప్రతిరైతుకు కిసాన్‌క్రెడిట్ కార్డును ఇవ్వాలి. రైతు ఖాతాలో బ్యాంకర్లు రుణం నిధులను జమచేసిన తరువాత రైతు వాడుకున్న మొత్తానికే వడ్డీ చెల్లించాలి. రైతుకు ఒకేసారి నిధులు అవసరం ఉండవు. పంట సాగునుంచి చివరి వరకు దఫాలుగా నిధులు అవసరం ఉంటాయి కాబట్టి ఖాతాలో నుంచి కార్డుద్వారా అవసరం ఉన్నపుడు తీసుకుని తిరిగి ఖాతాలో జమచేసే వీలుండాలి. దీనివల్ల రైతులకు ఎప్పుడూ నిధులు అందుబాటులో ఉంటాయి, వడ్డీ తగ్గుతుంది. పంటకాలంలోనైనా తమకు పంటరుణాలు దక్కుతాయని అన్నదాతలు ఆశలు పెంచుకున్నారు. జిల్లాలో సన్న, చిన్నకారు రైతులే అధికంగా ఉండగా వీరికి ప్రభుత్వం అందించే పంటరుణాలే ఆధారం కానున్నాయి. గతకొన్ని సీజన్లుగా పంటరుణాల పంపిణీ లక్ష్యానికి దూరంగానే నిలిచిపోతుండగా కౌలు రైతులకు సైతం పంటరుణాల పంపిణీ దరిచేరడం లేదు. రైతులకు ఒకేసారి రుణమొత్తాన్ని చెల్లించి ఒకేసారి వసూలు చేస్తున్నారు. మరోవైపు పంటరుణ పరిమితి ఒక్కో పంటకు ఒక్కో రకంగా ఉంటున్నా ఈ పరిమితి మేరకు ఇవ్వడం లేదు. జిల్లాలో జాతీయ, గ్రామీణ, సహకార బ్యాంకులుండగా వీటిద్వారా రైతులకు రుణాలను అందిస్తున్నారు. కొన్ని బ్యాంకుల్లో పంటరుణాల మంజూరు, రెన్యూవల్స్ రైతులకు తలకుమించిన భారంగా మారుతోంది. మరోవైపు జిల్లాలో కౌలురైతులుంటారు కాబట్టి వీరిరికూడా వచ్చే వానాకాలం పంటరుణాన్ని దరిచేర్చేలా చర్యలుండాలి. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేసినపుడే రైతులకు పంటరుణాల పంపిణీ లక్ష్యం నెరవేరుతుంది. రైతులకు పంట రుణంతో పాటుగా స్వల్ప, ధీర్ఘకాలిక, భూమి అభివృద్ధి, బావుల తవ్వకం, మోటార్లు, పైపులైన్లకు కూడా రుణాలను మంజూరివ్వాల్సి ఉంటుంది.

# వాటర్ బాంబ్..

న్యూఢిల్లీ,భారత్–చైనా సరిహద్దులో చైనా ప్రతిపాదించిన భారీ జలవిద్యుత్ ప్రాజెక్టుపై అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టును ఆయన 'వాటర్ బాంబ్'గా అభివర్ణించారు, ఇది దేశ భద్రతకు, లక్షలాది మంది జీవనాధారమైన నదీ వ్యవస్థకు తీవ్ర ముప్పు అని హెచ్చరించారు.బ్రహ్మపుత్ర నదిపై చైనా నిర్మించతలపెట్టిన ప్రపంచంలోనే అతిపెద్ద హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు భారత్‌కు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ ఈ ప్రాజెక్టుపై తన భయాన్ని వ్యక్తం చేస్తూ, ఇది సైనిక ముప్పుకు మించినదిగా అభివర్ణించారు. "చైనాపై ఎటువంటి విశ్వాసం పెట్టలేం. వారు ఏ సమయంలో ఏ చర్యలు తీసుకుంటారో తెలియదు. జలవిద్యుత్ ప్రాజెక్టు పేరుతో వారు భారీ డ్యామ్ నిర్మిస్తున్నారు. కానీ ఇది నీటిని నిల్వ చేయడానికే కాదు.. అవసరమైతే నీటిని ఆయుధంగా మార్చే ప్రయత్నం కావచ్చు. ఒక్కసారిగా నీటిని విడుదల చేస్తే సియాంగ్ ప్రాంతమంతా సమూలంగా నాశనమవుతుంది" అని ముఖ్యమంత్రి ఖండూ హెచ్చరించారు. ఈ ప్రాజెక్టు భారత్–చైనా సరిహద్దుకు కేవలం 30 కిలోమీటర్ల దూరంలోనే ఉండటం ఆందోళనను మరింత పెంచుతోంది.

– ప్రాజెక్టు ముప్పులు.. భారత దేశానికి ప్రమాదాలు

చైనా నిర్మించ తలపెట్టిన ఈ భారీ డ్యామ్ నిర్మాణ వ్యయం సుమారు 137 బిలియన్ డాలర్లుగా అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల భారత్ ఎదుర్కోబోయే ప్రధాన ప్రమాదాలు ఎక్కువగా ఉన్నాయి. వేసవి కాలంలో బ్రహ్మపుత్ర నదికి నీటి ప్రవాహం తగ్గిపోవచ్చు. ఇది దిగువ ప్రాంతాల్లోని వ్యవసాయం, జీవనాధారాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వర్షాకాలంలో చైనా ఒకేసారి భారీగా నీటిని విడుదల చేస్తే, అస్సాం, అరుణాచల్, ఇంకా బంగ్లాదేశ్ ప్రాంతాలు తీవ్ర ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. డ్యామ్ నిర్మాణం పూర్తయిన తర్వాత, చైనా జల పరిపాలనను రాజకీయ లేదా సైనిక ప్రయోజనాల కోసం ఆయుధంగా వాడే అవకాశం ఉందని భారత అధికారులు భయపడుతున్నారు.

# గ్రేటర్ హైదరాబాద్ వాసులకు తీపి కబురు...




హైదరాబాద్, గ్రేటర్ హైదరాబాద్‌లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేవారికి తీపి కబురు చెప్పింది ప్రభుత్వం. ఇసుక కొరత తీర్చడానికి కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ కొత్తగా నాలుగు ఇసుక బజార్లను ప్రారంభించింది. దీంతో ఇల్లు కట్టుకునేవారికి ఇసుక సమస్య తీరనుంది.తెలంగాణతోపాటు ఏపీలో నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఏపీ రాజధాని అమరావతిలో నిర్మాణాలు మొదలయ్యాయి. దీంతో ఇసుక విషయంలో కొరత ఏర్పడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆ విషయాన్ని కాసేపు పక్కనబెడితే.. తెలంగాణలో నిర్మాణాలకు ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకుంటోంది ప్రభుత్వం.తాజాగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నాలుగు ఇసుక బజార్లను ప్రారంభించింది తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ. రంగారెడ్డి జిల్లాలో వట్టి నాగులపల్లి, అబ్దుల్లాపూర్ మెట్, ఆదిభట్ల, మేడ్చల్ జిల్లాలో భౌరంపేటలో ఉన్నాయి. ఆ నాలుగు ప్రాంతాల్లో ఇసుక బజార్లు అందుబాటులో ఉన్నాయి.ఆయా బజార్లలో సన్న ఇసుకను టన్ను రూ. 1800 ఉంది. అదే దొడ్డు ఇసుకను రూ. 1600కు విక్రయిస్తున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. అన్ని ఇసుక బజార్లలో నాణ్యమైన.. నది ఇసుక నిల్వలు ఉన్నాయని పేర్కొంది. వ్యక్తిగత వినియోగదారులు, కాంట్రాక్టర్లు, నిర్మాణ సంస్థల అవసరాలను తీర్చగలిగేలా పూర్తిస్థాయిలో కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చు. హైదరాబాద్ సిటీలో ఇసుక సమస్య నిర్మాణ రంగానికి పెద్ద సమస్యగా మారింది. ఇసుక సరఫరాలో ఆలస్యం, దీనికితోడు అధిక ధరలు తోడయ్యాయి. అక్రమ రవాణా సమస్యల కారణంగా పలు ప్రాజెక్టులు డిలే అవుతున్నాయి. నిర్మాణ వ్యయం పెరగడంతో వినియోగదారులపై భారం తీవ్రమైంది.సిటీకి ప్రధానంగా ఇసుక కృష్ణా, గోదావరి నదుల రీచ్‌ల నుంచి వస్తోంది. దీనికితోడు వర్షాకాలంలో రీచ్‌లలో తవ్వకాలు నిలిచిపోవడం కొరతకు మరో కారణం. ఈ క్రమంలో ఇసుక బజార్ల ఏర్పాటు నిర్మాణ రంగానికి సానుకూలంగా మారుతుందని భావిస్తున్నారు. వినియోగదారులు ఇసుకను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు.

# వన్ సైడ్ పాలిటిక్స్ కేటీఆర్ స్టైల్ !

హైదరాబాద్,కేటీఆర్ తనకు తాను ప్రెస్ క్లబ్ వేదికగా చర్చకు సవాల్ చేశారు. తమ పార్టీ నేతలతో ప్రెస్ క్లబ్ బుక్ చేసుకున్నారు. ఓ కుర్చీకి సీఎం రేవంత్ రెడ్డికి రిజర్వ్ చేసినట్లుగా స్టిక్కర్ పెట్టారు. మరో కుర్చీలో తాను కూర్చున్నారు. సీఎం రాలేదని చెప్పి.. చర్చలకు దమ్ము లేని రేవంత్ ఇంకెప్పుడూ సవాళ్లు చేయవద్దని తేల్చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో ఎక్కడైనా రేవంత్ ను ఇన్వాల్వ్ చేయలేదు. కనీసం కాంగ్రెస్ పార్టీ అయినా మేము వస్తామని చెప్పలేదు. సరే కేటీఆర్ అంటున్నారు కాబట్టి వస్తామని చెప్పినా కేటీఆర్ కు రేవంత్ మాత్రమే రావాలి. చివరికి ఇదో స్టేజ్ డ్రామాలాగా ముగిసిపోయింది. రేవంత్ భయపడ్డాడని రాలేదని బీఆర్ఎస్ ప్రచారం చేసుకుంటోంది. మొత్తం వన్ సైడ్ వ్యవహారంలా ఈ ఎపిసోడ్ జరిపేసుకున్నారు.

**బరిలో తలపడాలి కానీ !**

ఎవరైనా కుస్తీ పోటీలు ఏర్పాటు చేసుకుంటే.. దానికి తగ్గ గ్రౌండ్ ను రెడీ చేసుకుంటారు. అంతే కానీ.. ఓ ఆటగాడు గ్రౌండ్ ను తానే ప్రిపేర్ చేసుకుని.. తానే మనుషుల్ని పెట్టుకుని..తన ప్రత్యర్థి కోసం ఎదురు చూసి.. రాలేదని విజేతగా ప్రకటించుకుంటే కామెడీగా ఉంటుంది. కేటీఆర్ చర్చా కార్యక్రమం సవాళ్లు అలాగే ఉన్నాయి కానీ.. ఏ మాత్రం కన్విన్సింగ్ గా లేవు. కేటీఆర్.. రేవంత్ విసిరిన సవాల్ కు సమాధానం చెప్పాలి. అంగీకారంతో చర్చా కార్యక్రమం నిర్వహించాలి. అంతే కానీ ఏకపక్షంగా ఓ కార్యక్రమం నిర్వహించేసి. చర్చకు దమ్ము లేదంటే ఎట్లా ?

**ఎక్కడికైనా వస్తారు.. అసెంబ్లీకి మాత్రం రారా ?**

ప్రతిపక్షం అంటే ఏదైనా సమస్య వస్తే అసెంబ్లీని పెట్టాలని డిమాండ్ చేయాలి. కానీ కేటీఆర్.. ఎక్కడికి రావాలంటే అక్కడికి వస్తాం.. చివరికి జూబ్లీహిల్స్ ప్యాలెస్ కు అయినా వస్తాం..చర్చకు రెడీ అంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తన అధికారిక నివాసం కోసం.. ప్రగతి భవన్ లు నిర్మించుకోలేదు. తన వ్యక్తిగత నివాసాన్నే ఉపయోగించుకుంటున్నారు. అది ప్యాలెస్ లా కేటీఆర్



చెబుతున్నారు. ఆ సవాళ్లలో.. అసెంబ్లీని మాత్రం చేర్చడం లేదు. అసెంబ్లీలో చర్చకు పెడతాం.. ప్రతిపక్ష నేత రావాలని అంటే మాత్రం కేటీఆర్ నోటి వెంట మాట రావడం లేదు. ఎక్కడికైనా వస్తాం కానీ.. అసెంబ్లీకి మాత్రం రానని అంటున్నారు.

**ప్రజాస్వామ్యంలో ప్రజలిచ్చిందే స్థాయి..కేటీఆర్ ఊహించుకున్నది కాదు !**

మాట్లాడిదే.. రేవంత్ రెడ్డికి కేసీఆర్ స్థాయి లేదని అందుకే ఆయన రారని.. ఆయనకు తానే ఎక్కువ అన్నట్లుగా కేటీఆర్ మాట్లాడుతున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఇచ్చిందే స్థాయి. కేసీఆర్ కు పదేళ్ల పాటు సీఎం స్థాయి ఇచ్చారు. ఇప్పుడు ఆ పొజిషన్ రేవంత్ రెడ్డికి ఇచ్చారు. కేసీఆర్‌కు ప్రతిపక్ష నేతగా బాధ్యతలు ఇచ్చారు. ఆ బాధ్యతల ప్రకారం నిర్వర్తించాలి కానీ.. తాము కొండ మీద ఉన్నామని.. మా స్థాయి వేరు అని అనుకుంటే.. ఎలా ?. కేటీఆర్ అదే అనుకుంటున్నారు. ఒక వేల కేసీఆర్ అసెంబ్లీకి రాకపోతే ఆ ప్రతిపక్ష స్థానాన్ని కేటీఆర్ తీసుకుంటే..అప్పుడు.. రేవంత్ ను సవాల్ చేసేందుకు సరైన పొజిషన్ కు వచ్చినట్లుగా అనుకోవచ్చు.అంతే కాదు.. సీఎం స్థాయిని గుర్తించబోమంటూ అహంకార రాజకీయాలు చేయడం .. ప్రజాస్వామ్యానికి అవమానమే.

# జగన్ ప్రాంతీయ భేటీలు...ఆ వర్గాలే టార్గెట్



అమరావతి,వైసీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్ జోరు పెంచేస్తున్నారు. ప్రస్తుతం ఓదార్పు యాత్రలు పరామర్శ యాత్రలతో నెలకు రెండు సార్లు జనంలోకి వస్తున్న జగన్ తనకు లభిస్తున్న ఆదరణను చూసుకుంటూ మరింత దూకుడు చేయాలని పక్కా ప్లాన్ తో సిద్ధంగా ఉన్నారని చెబుతున్నారు.రానున్న రోజులలో ప్రాంతీయ స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని కీలక సామాజిక వర్గాలతో భేటీలు వేయాలని జగన్ ఒక మాస్టర్ ప్లాన్ ని రచించారు అని అంటున్నారు 2024 ఎన్నికల్లో వైసీపీకి దాదాపుగా 40 శాతం ఓటు షేర్ దక్కింది. దానికి కారణం వైసీపీని అట్టేబెట్టుకుని ఉన్న ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బీసీ వర్గాల ఓట్లే అని వైసీపీ అధినేత విశ్లేషించుకుంటున్నారు.అయితే రేపటి ఎన్నికల్లో గెలిచేందుకు ఈ ఓటు షేర్ సరిపోదని కూడా భావిస్తున్నారు 2019 నుంచి 2024 మధ్యలో వైసీపీకి దూరంగా ఉన్న వివిధ సామాజిక వర్గాలను అక్కున చేర్చుకోకపోతే ఇబ్బందులు ఎదురవుతాయని కూడా భావిస్తున్నారుట. ఈ క్రమంలో ఆయన సామాజిక వర్గాలను దగ్గరకు తీయాలని జగన్ ఆలోచిస్తున్నట్లుగా చెబుతున్నారు.ఇక చూస్తే కనుక వైసీపీ పాలనలో ఎక్కువగా కొన్ని సామాజిక వర్గాలనే ఫోకస్ చేయడం పదవుల నుంచి అన్నీ వారికే ఇవ్వడంతో పాటు వారికే పథకాల విషయంలో ప్రాధాన్యత ఇవ్వడంతో మిగిలిన సామాజిక వర్గాలు దూరం అయ్యాయని వైసీపీ అంచనా వేసుకుంటోంది. ప్రభుత్వం అంటే అందరిదీ అన్న భావన కలిగించాల్సిన సమయంలో గత సారి కొన్ని పొరపాట్లు జరిగాయని వైసీపీ పెద్దలు విశ్లేషించుకుంటున్నారుట.అందువల్ల ఈసారి అలాంటివి జరగకుండా చూసుకుంటామని చెప్పేందుకు వారి విశ్వాసం పొందేందుకు స్వయంగా జగన్ ప్రాంతీయ స్థాయిలో సమావేశాలను ఏర్పాటు చేసి ఆయా సామాజిక వర్గాలతో నేరుగా మాట్లాడుతారు అని అంటున్నారు. రానున్న రోజులలో ఈ తరహా ప్రాంతీయ సదస్సులు ఉంటాయని చెబుతున్నారుఈ క్రమంలో అగ్ర వర్ణాల వారు అయిన రెడ్డి కాపు, కమ్మ, బ్రాహ్మణ, వైశ్య వర్గాలతో జగన్ చర్చిస్తారు అని అంటున్నారు. ఆయా సామాజిక వర్గాలకు చెందిన ముఖ్యులతో జగన్ నేరుగా సమావేశమై వారి సమస్యలు తెలుసుకుని తమ పార్టీ తరఫున వారికి ఏమి చేయగలమన్నది కూడా చెబుతారని అంటున్నారు.ఇక కాపులతో సమావేశాలకు రాజమండ్రీని వేదికగా ఎంచుకుంటున్నారు. కమ్మలతో సమావేశాలకు గుంటూరు ని వేదికగా చేసుకుంటున్నారు వైశ్యులతో సమావేశాలను విజయవాడలో నిర్వహిస్తారుట. అలాగే రెడ్డి సామాజిక వర్గంతో సమావేశాలను తిరుపతిలో నిర్వహిస్తారని అంటున్నారు. బ్రాహ్మణ సామాజిక వర్గంతో సమావేశాలను విశాఖలో నిర్వహించి వారి సమస్యలను స్వయంగా జగన్ అడిగి తెలుసుకుంటారని అంటున్నారు.ఈ సామాజిక వర్గాలను మచ్చిక చేసుకుంటే వైసీపీకి మరింత గెలుపు భరోసా దొరుకుతుందని భావిస్తున్నారుట. అంతే కాదు అర్బన్ ఏరియాలలో వైసీపీ బాగా వీక్ గా ఉంది. దాంతో అక్కడ బలపడేందుకు కూడా ఈ తరహా సమావేశాలు ఉపయోగపడతాయని చెబుతున్నారు. తొందరలోనే ఈ ప్రాంతీయ భేటీలు ఉంటాయని అంటున్నారు. చూడాలి మరి ఈ ప్లాన్ ఏ విధంగా మెటీరియలైజ్ అవుతుందో.

# 1996 బాంబు పేలుళ్ల కేసు.. 29 ఏళ్ల తర్వాత నిందితుడి అరెస్ట్




బెంగళూరు: 1996 కోయంబత్తూరు బాంబు పేలుళ్ల కేసులో దాదాపు మూడు దశాబ్దాలుగా తప్పించుకుని తిరుగుతున్న ప్రధాన నిందితుడు, సీరియల్ కిల్లర్ సాదిక్ రాజా అలియాస్ టైలర్ రాజాను ఎట్టకేలకు అరెస్టు చేశారు. కర్ణాటకలోని విజయపురలో తప్పుడు గుర్తింపుతో నివసిస్తున్న అతన్ని కోయంబత్తూరు పోలీసులు పట్టుకున్నారు. చామరాజనగర్ జిల్లాలోని గుండ్లుపేటకు చెందిన సాదిక్ రాజా 1996 పేలుడు తర్వాత పరారీలో ఉన్నాడు. పోలీసు వర్గాల ప్రకారం.. నిందితుడు ఒకే చోట ఉండకుండా పలు రాష్ట్రాలకు మారుతూ తప్పించుకు తిరిగాడు. మొదట తమిళనాడు నుండి బెంగళూరుకు, తరువాత హుబ్బళ్లికి, చివరికి విజయపురలో స్థిరపడ్డాడు. గత 12 సంవత్సరాలుగా, అతను కూరగాయల వ్యాపారిగా పనిచేస్తూ, మారు పేరుతో నివసిస్తూ, తక్కువ ప్రొఫైల్ జీవితాన్ని గడిపాడు. అతను హుబ్బళ్లిలో ఒక స్థానిక మహిళను కూడా వివాహం చేసుకున్నాడు. ఇది అతను సమాజంలో కలిసిపోవడానికి మరింత సహాయపడింది.సాదిక్ రాజా 1996 కోయంబత్తూరు పేలుడులో పాల్గొనడమే కాకుండా.. మధురై, నాగూర్ పేలుళ్లతో సహా ఇతర ప్రధాన సంఘటనలలో కూడా పాత్ర పోషించాడని దర్యాప్తులో వెల్లడైంది. అతనిని గుర్తించకుండా ఉండటానికి.. తన పేరు, గెటప్, నివాసాన్ని మారుస్తూ తిరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. చివరికి.. కోయంబత్తూరు పోలీసులు పక్కా విశ్వసనీయ నిఘా సమాచారం ఆధారంగా రంగంలోకి దిగి అరెస్టు చేశారు. చివరి దశ వరకు విజయపురలోని స్థానిక పోలీసులకు కూడా వివరాలను దాచిపెట్టి, ఈ ఆపరేషన్ అత్యంత రహస్యంగా నిర్వహించారు. తమిళనాడు ఉగ్రవాద నిరోధక దళం, కోయంబత్తూరు నగర పోలీసుల సంయుక్త బృందం ఈ ఆపరేషన్‌కు నాయకత్వం వహించింది.ఈ ఆపరేషన్ లో పాల్గొన్న ఒక సీనియర్ పోలీసు అధికారి మాట్లాడుతూ.. “అరెస్టు నుంచి తప్పించుకునేందుకు సాదిక్ తన పేరు, నివాసాన్ని మార్చుకుంటూనే ఉన్నాడు. సంవత్సరాల తరబడి ట్రాక్ చేసిన తర్వాత, మేము చివరికి అతను ఉండే ప్రాంతాన్ని గుర్తించాం. విచారణ, ఇతర నిందితుల నుండి వచ్చిన ఇన్‌పుట్‌ల ద్వారా అతన్ని పట్టుకున్నాం” అని చెప్పారు. సాదిక్ రాజాను అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ కోసం తమిళనాడుకు తరలించారు. 29 ఏళ్లుగా తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన 2023లో స్థాపించబడిన ఉగ్రవాద నిరోధక దళాన్ని ముఖ్యమంత్రి ఎం కె స్టాలిన్ అభినందించారు.

# హిమాచల్‌ను ముంచెత్తిన వరదలు..

హిమాచల్:హిమాచల్‌ప్రదేశ్‌ను ఆకస్మిక వరదలు హడలెత్తించాయి. దీంతో మండి జిల్లాలో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరిగింది. ఇప్పటి వరకు 91 మంది చనిపోయారు. ఇక కొండచరియలు విరిగిపడడంతో గ్రామాలకు గ్రామాలే దెబ్బతిన్నాయి.ఆకస్మాత్తుగా వరదలు సంభవించడంతో చాలా మంది ప్రవాహంలో కొట్టుకుపోయారు. ఇక పంగ్లుయెడ్ గ్రామంలో రెండు కుటుంబాలకు చెందిన తొమ్మిది మంది గల్లంతయ్యారు. వారికి సంబంధించిన నలుగురి మృతదేహాలు దాదాపు 150 కి.మీ. దూరంలో లభ్యమయ్యాయి. మరో ఐదుగురి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. మృతదేహాలు చాలాదూరం కొట్టుకుపోతుండడంతో గుర్తించడం కష్టంగా మారింది. డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతదేహాలను గుర్తిస్తామని అధికారులు పేర్కొన్నారు.ఇక రాష్ట్ర వ్యాప్తంగా 207 రోడ్డు మార్గాలను మూసేశారు. పలు ప్రాంతాల్లో అంధకారం అలుముకుంది. వందల సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులయ్యారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన బృందాలు, బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ దళాలు సహాయక



చర్యలు కొనసాగిస్తున్నాయి. ఇక రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ కొనసాగిస్తోంది. ఇక కొండచరియలు విరిగి పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# బీజేపీ ఎమ్మెల్యే కుమారుడికి టీడీపీ ఇన్‌చార్జ్ పదవి!

అమరావతి,జాతీయ స్థాయిలో బీజేపీ ఎంతో శక్తిమంతమైన పార్టీ. అయితే ఏపీలో మాత్రం టీడీపీకి అనుబంధ సంస్థగా బీజేపీ వ్యవహరిస్తోందనే విమర్శలున్నాయి. అందుకు తగ్గట్టుగానే బీజేపీ తీరు వుంది. కూటమిలో బీజేపీ ఉన్నప్పటికీ, ఆ పార్టీ నిండా చంద్రబాబు భక్తులే. టీడీపీ రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేసే వాళ్లున్నారంటే అతిశయోక్తి కాదు. నిన్నమొన్నటి వరకూ ఏపీ బీజేపీ నాయకత్వం ఎవరి చేతుల్లో ఉన్నదో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.ఏపీలో బలపడాలని బీజేపీ జాతీయ నాయకత్వానికే లేనప్పుడు, ఆ పార్టీ కార్యకర్తలు బాధపడితే ఏం లాభం? అనే ప్రశ్న నిత్యం వారిని వెంటాడుతూనే వుంది. తన పార్టీ నాయకులకు టికెట్ ఇవ్వలేకుంటే, బీజేపీలోకి పంపి సర్దుబాటు చేసిన సమర్థత చంద్రబాబుది. ఇందుకు నిదర్శనం అనపర్తి సీటును బీజేపీకి కేటాయిస్తే, టీడీపీ ఇన్‌చార్జ్ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి రచ్చరచ్చ చేశారు. అప్పటికే బీజేపీ ప్రకటించిన అభ్యర్థిని ప్రచారంలో అడ్డుకున్నారు.దీంతో వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టాలనే ఉద్దేశంతో నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి పురందేశ్వరి చేతుల మీదుగా బీజేపీ కండువా వేయించి, పనిలో పనిగా బీ ఫారం కూడా ఇప్పించారు. రామకృష్ణారెడ్డి కుమారుడు మనోజ్ భవిష్యత్‌లో బీజేపీకి ఇన్‌చార్జ్ కావడం న్యాయం. కానీ అనపర్తి టీడీపీ ఇన్‌చార్జ్‌గా రామకృష్ణారెడ్డి కుమారుడికి త్వరలో బాధ్యతలు అప్పగిస్తుండడం విశేషం. ఇప్పటికే కర్నూలులో ఇలాంటి పరిస్థితినే చూడొచ్చు. మంత్రి టీజీ భరత్ తండ్రి, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ బీజేపీ నాయకుడిగా వ్యవహరిస్తున్నారు.టీడీపీ నుంచి బీజేపీలో చేరిన టీజీ వెంకటేశ్



కుమారుడిని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా టికెట్ ఇవ్వడం, గెలిచాక ఆయనకు మంత్రి పదవి కూడా కట్టబెట్టడం చూసేవాళ్లకు విచిత్రంగా కనిపించొచ్చు. కానీ ఏపీలో బీజేపీ, టీడీపీ పాలునీళ్లలా కలిసిపోయాయి. టీడీపీ కోసం బీజేపీ ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా వుంది.బీజేపీ కంటే టీడీపే తమ అసలుసిసలైన పార్టీగా అందులోని చాలా మంది నాయకులు భావిస్తారనే అభిప్రాయం వుంది. ఏపీలో ఎదగాలనే ఆలోచన వుంటే, బీజేపీ అధిష్టానం ఇలాంటి చర్యల్ని అనుమతించి వుండేదికాదు. బీజేపీ నియామకాల్ని కూడా చంద్రబాబే చేస్తున్నారంటే, ఏపీలో ఆ పార్టీ దీనస్థితిపై జాలిపడడం తప్ప చేయగలిగేదేమీ వుండదు.

# కబ్జా అవుతున్నా మౌనం ఎందుకు? తెలంగాణ బీజేపీ చీఫ్‌కి కేటీఆర్ ప్రశ్న




హైదరాబాద్, తెలంగాణలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయా? బీఆర్ఎస్–బీజేపీల మధ్య మాటల యుద్ధం తీవ్రమవుతుందా? రాముడి భూములు కబ్జా వ్యవహారాన్ని తెరపైకి తెచ్చారు కేటీఆర్. ఈ విషయంలో తెలంగాణ బీజేపీ చీఫ్ మౌనంగా ఎందుకున్నారని ప్రశ్నించారు. కేటీఆర్ కామెంట్స్‌పై తెలంగాణ బీజేపీ రియాక్ట్ అవుతారా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.ఏపీలో భద్రాచలం ఆలయ భూముల కబ్జాపై మాజీ మంత్రి కేటీఆర్ రియాక్ట్ అయ్యారు. రాముడి భూములు కబ్జా అవుతున్నా తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని ప్రశ్నించారు. 889 ఎకరాల భూమి కబ్జా అయినా బీజేపీ కనీసం ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. రాజకీయ పొత్తులు పక్కన పెట్టి భద్రాచలం దేవస్థానం భూములను కాపాడేందుకు ముందుకు రావాలన్నారు.హైకోర్టు ఉత్తర్వులను అమలు చేసేలా చూడాలన్నారు. ఇంతకీ భద్రాచలం ఆలయ భూములు ఏపీ కబ్జా చేయడమేంటి? ఇటీవల ఆలయ ఈవో రమాదేవిపై పురుషోత్తపట్నం గ్రామస్తులు ఎందుకు దాడికి పాల్పడ్డారు? దీనివెనుక అసలు కథేంటి? ఇంకాస్త లోతుల్లోకి వెళ్తే..ఇటీవల భద్రాచలం సీతారాముల ఆలయ భూములపై రగడ జరుగుతోంది. శ్రీరాముడి ఆలయానికి సంబంధించి భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. దీనిపై భూఅక్రమణదారులు– దేవాదాయ శాఖ ఉద్యోగుల మధ్య వివాదం తారాస్థాయికి చేరింది. ఈ క్రమంలో అక్కడికి వెళ్లిన ఆలయ ఈవో రమాదేవిపై పురుషోత్తపట్నం గ్రామస్థులు దాడి చేశారు. ఇంతకీ గ్రామస్తులు దాడి వెనుక అసలు కారణమేంటి?ఏపీ విభజన తర్వాత పురుషోత్తపట్నం గ్రామం ఆంధ్రప్రదేశ్‌లో కలిసింది. ఆలయానికి సంబంధించి ఏపీ, తెలంగాణల్లో 1300 ఎకరాలు భూములు ఉన్నాయి. అందులో పురుషోత్తపట్నం గ్రామంలో 889 ఎకరాల భూమి ఉంది. ఆ గ్రామం అల్లూరు సీతారామరాజు జిల్లాలో ఉంది. కొన్నాళ్లుగా ఆ భూములపై వివాదం సాగుతోంది.అయితే దేవాదాయ శాఖ ఆయా భూముల్లో నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించింది. ఇప్పటికే గోశాల నిర్మిస్తోంది కూడా. దాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ వ్యవహారంపై న్యాయస్థానంలో వివాదం నడుస్తోంది. కొద్దిరోజుల కిందట ఆ భూమి దేవస్థానానికి అప్పగించాలని ఏపీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.అంతకుముందు ప్రభుత్వం దేవాలయ భూములపై పాస్‌బుక్‌లు ఆ గ్రామస్తులకు అందజేసింది. ప్రస్తుతం ఆ గ్రామస్తులు నిర్మాణాలు చేస్తున్న విషయం తెలుసుకున్న ఆలయ ఈవో రమాదేవి అక్కడికి వెళ్లారు. ఆమెపై గ్రామస్తులు దాడి చేయడాన్ని తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది.దేవాదాయ భూములను కబ్జా చేస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు మంత్రి కొండా సురేఖ. ఈ వ్యవహారంపై తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్‌రావుని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. దీనిపై బీజేపీ నేతలు ఎలా రియాక్ట్ అవుతారో చూడాలి.

# అరెస్ట్‌కు సిద్ధమని డైలాగులు హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్లు !



అమరావతి,వైసీపీ నేతలు మైకుల ముందు పులులు.. తేడా వస్తే పిల్లులు అని నిరూపిస్తున్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి , చెవిరెడ్డి లాంటి వాళ్లు ఎక్కడికీ పోను.. దమ్ముంటే అరెస్టు చేసుకోండి అని సవాళ్లు చేస్తారు..తీరా అరెస్టు చేయడానికి వస్తే పరార్ అయిపోయి కోర్టుల్లో పిటిషన్లు వేస్తారు. నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి కూడా అలాగే ఉన్నారు. ఆయన మీడియా ముందు .. దమ్ముంటే అరెస్టు చేసుకోండి అని సవాల్ చేశారు. అలా సవాల్ చేస్తున్న సమయంలోనే ఆయన తరపున హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలయ్యాయి.కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అత్యంత ఘోరమైన మాటలు మాట్లాడారు. ఓ మహిళను అనకూడని మాటలన్నీ అన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం సీరియస్ గా స్పందించింది. మహిళా లోకం మండిపడింది. పోలీసులకు ప్రశాంతిరెడ్డి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు అయింది. తన వ్యాఖ్యలను సమర్థించుకున్న.. ఆయన జైలుకెళ్లడానికి సిద్ధమేనన్నారు. కేసులు నమోదు కావడంతో జైలుకు పంపుతారన్న భయంతో వెంటనే హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.తాను ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయలేదని..అంతా ప్రజాస్వామ్య భాషే వాడానని ఆయన చెప్పుకొచ్చారు. కానీ ఆయన అన్న మాటల్ని న్యాయమూర్తి వింటే ప్రసన్నకుమార్ రెడ్డికి ముందస్తు బెయిల్ కాదు కదా.. అలాంటి మాటలు వినిపించినందుకు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసే అవకాశం ఉంది. అలాంటి మాటలు మాట్లాడిన ప్రసన్నకుమార్ రెడ్డి.. బయటకు మాత్రం.. రెచ్చిపోతున్నారు.

Printed, Published & Owned by **MEDE SHANTHI KUMAR**, Printed at **SPOORTHI PRINTERS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From **SPOORTHI PUBLICATIONS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: **MEDE SHANTHI KUMAR.**